# సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి

సంపుటి : 21 | సంచిక : 34 | 24.8.2026 నుంచి 30.8.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com |


- కోటి 20 లక్షలకు పైగా ఓట్లపై ఈసీ కత్తెర..
- వీధిపోరాటం లేదు.. బూత్‌లలో మాత్రం పకడ్బందీ నిఘా!
- ఓట్ల వడపోత.. రాజకీయ పార్టీల కొత్త ఎత్తుగడ
- ఓటర్ల జాబితా ప్రక్షాళన.. మౌనం వెనుక భారీ రాజకీయ లెక్కలు
- రచ్చకంటే బూత్‌లపైనే ఫోకస్

**అమరావతి:** కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర ప్రక్షాళన రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి సాంకేతికంగా కోటి 20 లక్షలకు పైగా ఓట్లు జాబితా నుంచి తొలగింపు ప్రక్రియలో ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకమే అయినప్పటికీ.. ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు జాబితా నుంచి తొలగిపోతున్నా ప్రధాన రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగకపోవడం ఆసక్తికరంగా మారింది. అసలు ఈ వ్యూహాత్మక మౌనం వెనుక కారణమేంటి?



# ఓట్ల ప్రక్షాళనపై రాజకీయ మౌనం!

## డూప్లికేట్ ఓట్లపైనే ఈసీ ఫోకస్?

ఈ తొలగింపులన్నీ అర్హులైన ఓటర్ల హక్కును హరించేందుకు జరుగుతున్నవి కావని, ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసే సాంకేతిక ప్రక్రియలో భాగమేనని రాజకీయ పార్టీలకు స్పష్టమైన అవగాహన ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత హైదరాబాద్‌తో పాటు రెండు రాష్ట్రాల్లోనూ నివాసాలు కలిగి ఉన్న పలువురికి రెండు చోట్ల ఓట్లు కొనసాగుతున్నాయి. అదే సమయంలో మరణించిన వారి పేర్లు జాబితాల్లో కొనసాగడం, నివాసాలు మారినప్పటికీ పాత చిరునామాల్లో ఓట్లు ఉండటం వంటి సమస్యలు ఉన్నాయి. ఆధార్--ఈపిక్ అనుసంధానం, ఇతర సాంకేతిక సమాచారాన్ని క్రాస్‌చెక్ చేయడం ద్వారా ఇలాంటి డూప్లికేట్, ఇన్‌యాక్టివ్ ఓట్లను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. అందువల్ల దీనిని పూర్తిగా ఓటు హక్కును కాలరాసే చర్యగా భావించాల్సిన అవసరం లేదన్న అభిప్రాయం పార్టీల్లో ఉంది. ఇదే కారణంతో ప్రధాన పార్టీలు వీధుల్లోకి వచ్చి పెద్దఎత్తున ఆందోళనలు చేయడం లేదనే విశ్లేషణ వినిపిస్తోంది.

## తెలంగాణలో కాంగ్రెస్‌దే భిన్న వ్యూహం

అయితే తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మాత్రం ఈ అంశాన్ని కొంత సీరియస్‌గా తీసుకుంటోంది. ఎన్నికల సంఘం దృష్టికి వరుసగా ఫిర్యాదులు తీసుకెళ్తోంది. దీనికి రాజకీయ కారణాలు కూడా లేకపోలేదు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. పట్టణ ప్రాంతాల్లోని డూప్లికేట్, బోగస్ ఓట్లు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపాయని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధితో పాటు ఇతర పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల జాబితా పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరిగితే.. క్లీన్ ఓటర్ లిస్ట్ తమకు రాజకీయంగా ప్రయోజనం కలిగిస్తుందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. అందుకే ప్రతి బూత్ స్థాయిలో తమ బూత్ లెవల్ ఏజెంట్లను అప్రమత్తం చేస్తూ.. తొలగింపునకు గురవుతున్న ఓట్లను పరిశీలిస్తోంది. నిజమైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది.

## మిస్సయిన ఓట్లకు మళ్లీ అవకాశం

మరోవైపు బీఆర్ఎస్, వైసీపీ, టీడీపీ-జనసేన కూటమి వంటి పార్టీలు పెద్దగా ఆందోళనలకు దిగకపోవడానికి క్షేత్రస్థాయి పరిస్థితులే కారణమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయా పార్టీల అంతర్గత అంచనాల ప్రకారం.. తొలగింపు జాబితాలో ఉన్న ఓట్లలో ఎక్కువ భాగం నివాసాలు మారినవారివి, డూప్లికేట్ ఓట్లవిగా ఉండే అవకాశం ఉంది. ఒకవేళ అర్హత ఉన్న ఓటరు పేరు పొరపాటున తొలగిపోయినా.. తిరిగి ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఫారమ్-6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దీంతో వీధుల్లోకి వచ్చి రాజకీయ పోరాటం చేయడం కంటే.. క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుని నిజమైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్పించడమే మేలని పార్టీలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## రచ్చ కంటే ఓటు రక్షణకే ప్రాధాన్యం

ఎన్నికల సంఘం క్లెయిమ్స్, అభ్యంతరాలు, ఫారమ్-7 వంటి ప్రక్రియలకు అవకాశం కల్పిస్తూ జాబితా ప్రక్షాళన చేపడుతోంది. దీంతో ప్రక్రియను పూర్తిగా వ్యతిరేకించడం రాజకీయ పార్టీలకు అంత సులభం కాదు. అదే సమయంలో తమకు మద్దతుగా ఉండే ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయా? లేదా? అన్నదానిపై పార్టీలు ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. కోటి 20 లక్షలకు పైగా ఓట్ల ప్రక్షాళన నేపథ్యంలో కనిపిస్తున్న ఈ 'రాజకీయ మౌనం' వెనుక అసలు వ్యూహం ఇదేనన్న విశ్లేషణ వినిపిస్తోంది. బహిరంగ ఆందోళనలతో రాజకీయ వేడి పెంచడం కంటే.. బూత్ స్థాయిలో ప్రతి ఓటును పరిశీలించడం, తమ మద్దతుదారుల ఓట్లను కాపాడుకోవడం, పొరపాటున తొలగిన అర్హులైన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్పించడం.. ఇదే ప్రస్తుతం పార్టీల ప్రాధాన్యంగా కనిపిస్తోంది.



## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు



**అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రివర్గం 55కి పైగా అజెండా అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. స్థానిక సంస్థల్లో రూరల్ ప్రాంతాల్లో బీసీలకు 34శాతం, అర్బన్‌లో 33.1 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, మేయర్ల ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతిలో వెళ్లాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

- కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల ప్రతిపాదనలకు ఆమోదం.
- తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడలో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు ఆమోదం.

## మండలిలో అల్లరి చేసి వెళ్లిపోవాలనేది వైకాపా ఉద్దేశం

**అమరావతి:** శాసన మండలిలో ప్రజా సమస్యలపై మాట్లాడరు.. అల్లరి చేసి సభ నుంచి వెళ్లిపోవాలనేది వైకాపా సభ్యుల ఉద్దేశంగా కనిపిస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. మండలి సమావేశాల్లో రెండోరోజు కూడా డీఎస్సీ అంశంపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం నడిచింది. ఛైర్మన్ మోషేను రాజు అధ్యక్షతన కార్యకలాపాలు ప్రారంభం కాగానే... డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని వైకాపా సభ్యులు వాయిదా తీర్మానం ఇచ్చారు. వాయిదా తీర్మానం తిరస్కరించిన మండలి ఛైర్మన్... ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు.

దీంతో వైకాపా సభ్యులు ఛైర్మన్ పోడియం చుట్టూ చేరి ఆందోళనకు దిగారు. ప్రశ్నోత్తరాల సమయంలోనే మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణకు ఛైర్మన్.. మాట్లాడే అవకాశమిచ్చారు. శాసనమండలిలో డీఎస్సీ గురించి చర్చ కోరుతుంటే ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తుందని బొత్స ప్రశ్నించారు. వేరే ఫార్మాట్లో రావాలని బొత్సకు ఛైర్మన్ చెప్పినా పట్టించుకోలేదు. దీంతో వైకాపా సభ్యుల తీరుపై శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్మన్‌ను అగౌరవపరిచేలా ప్రతిపక్ష సభ్యులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎలా నడపాలనేది ప్రజలు నిర్ణయించారని... ప్రజాతీర్పు ప్రకారమే సభను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఎల్‌నినో సమస్య తీవ్రంగా ఉండి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కాబట్టి.. ఆ అంశంపై ముందు చర్చించి.. డీఎస్సీ గురించి తర్వాత మాట్లాడతామన్నారు. డీఎస్సీ చాలా ముఖ్యమైన విషయమని బొత్స వాదనకు దిగేందుకు ప్రయత్నించగా...



పయ్యావుల తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. డీఎస్సీ అంటేనే తెలుగుదేశమని... 14సార్లు డీఎస్సీ ఇచ్చామని తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా పని చేసి ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని బొత్స... ఇప్పుడు డీఎస్సీపై, నిరుద్యోగులపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... డీఎస్సీపై శాసనసభలో మాట్లాడి, మండలిలో చర్చించేందుకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. వాస్తవ విషయాలు శాసనసభ మాదిరిగానే మండలిలోనూ చర్చించాలన్నారు. మెగా డీఎస్సీపై చర్చకు సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు. బీఏసీలో చర్చించి ఏ ఏ అంశాలు చర్చకు పెట్టాలో నిర్ణయించాలని ఛైర్మన్ మోషేన్‌రాజు సూచించారు. వైకాపా సభ్యుల నినాదాల మధ్య సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు స్పెషల్ టెట్

**అమరావతి:** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష-ఆగస్టు-2026) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. అక్టోబర్ 11 నుంచి 21 వరకు రోజూ ఉదయం, మధ్యాహ్నం కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహించనున్నారు. సీనియర్ ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉండేలా పాస్ మార్కులు తగ్గించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. అర్హత మార్కుల్లో ఎలాంటి మార్పు చేయలేదు. 150 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో ఓసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 60శాతం (90 మార్కులు), బీసీలకు 50శాతం (75 మార్కులు), ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికులకు 40శాతం (60 మార్కులు) పాస్ మార్కులుగా కొనసాగించనున్నట్లు నోటిఫికేషన్‌లో స్పష్టంచేశారు. పేపర్-1, పేపర్--2గా పరీక్ష ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 150 ప్రశ్నలు, 150 మార్కులు, 2 గంటల 30 నిమిషాల సమయం ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ లేదు. ఈ స్పెషల్ టెట్ ఉత్తీర్ణత ప్రస్తుత ఉద్యోగంలో కొనసాగేందుకు లేదా పదోన్నతికి అవసరమైన అర్హతగా మాత్రమే పరిగణిస్తారని, భవిష్యత్‌లో ప్రత్యక్ష నియామకాలకు మాత్రం ఇది చెల్లదని పాఠశాల విద్యాశాఖ స్పష్టంచేసింది.



## రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్‌బై!



**సూళ్లూరుపేట:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో కీలకమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇకపై రాకెట్, శాటిలైట్ల తయారీ వంటి కార్యకలాపాల నుంచి ఇస్రో క్రమంగా తప్పుకోనుంది. ఈ బాధ్యతలను ప్రైవేట్ అంతరిక్ష సంస్థలకు, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారు. పరిశ్యోధనా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే దిశగా ఇస్రో శాస్త్రీయ ప్రయోగాలు, ప్రత్యేక మిషన్లపై మరింత దృష్టిసారించే పరిస్థితి కనిపిస్తోంది. ఈ మార్పు ఇస్రోలో ఇప్పటికే ప్రారంభమైంది. చిన్న తరహా ఉపగ్రహాలను ప్రయోగించే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సాంకేతికత, ఉత్పత్తి హక్కులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు బదిలీ చేశారు. ఆ తదుపరి దశలో భారత్‌కు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన పీఎస్ఎల్వీ, ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరుగాంచిన ఎల్వీఎం-3 రాకెట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ప్రైవేట్ రంగానికి బదిలీచేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఈసారి ప్రభుత్వ రంగ సంస్థలకు బదులుగా ప్రైవేట్ పరిశ్రమలకే అవకాశం కల్పించనున్నట్లుగా ఇన్‌స్పేస్ చైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా ఇటీవల తెలిపారు. ఇకపై ఇస్రో ఒక తయారీ సంస్థగా కాకుండా ప్రధాన పరిశోధన, అభివృద్ధి సంస్థగా పనిచేయనుంది. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ మిషన్లు, ప్రత్యేక ఉపగ్రహాలు, అధునాతన అంతరిక్ష మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టిసారించనుంది. ఒక సాంకేతికత అభివృద్ధి చెంది వాణిజ్యపరంగా వినియోగించేం దుకు సిద్ధమైన తరువాత దాన్ని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తామని గోయెంకా తెలిపారు. ఇప్పటివరకు ఇస్రోకు చెందిన 120 సాంకేతికతలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేసినట్లుగా కూడా ఆయన వెల్లడించారు.

## గ్రామాభ్యుదయమే కూటమి ధ్యేయం



**విజయనగరం** : గ్రామాభ్యుదయమే కూటమిప్రభుత్వ ధ్యేయమని విజయనగరం ఎమ్మెల్యే అధితిగజపతిరాజు అన్నారు. ప్రజావసరాలను గుర్తించి, వాటి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వహించడం వలనే గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. గ్రామాలలో కనీస సదుపాయలు కల్పించడం వలన ఆర్థికంగా ఊతమివ్వడానికి అవకాశం కలుగుతుందన్నారు. జొన్నవలస అడ్డురోడ్డు జంక్షన్ నుంచి రాకోడు, పినవేమలి మీదుగా పెదవేమలి జంక్షన్ వరకూ 2 కోట్ల 15 లక్షల రూపాయలతో రహదారి నిర్మాణానికి ఆమె శంఖుస్థాపన చేశారు. అలానే, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 16 మందికి 15 లక్షల 86 వేల 402 రూపాయలను వారికి చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని రెండింటినీ సమాంతరంగా నడుపుతున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో వేస్తున్న పునాదులు రాష్ట్ర భవిష్యత్ కి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఒక పక్క పారిశ్రామికంగా రాష్ట్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటూనే ప్రజల సంక్షేమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లునూ చేస్తున్నారని అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీకి తగ్గట్లు పథకాలను అమలుచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

## ముంబయిని వీడుతున్న ఆటో డ్రైవర్లు..

**ఢిల్లీ** : మహారాష్ట్రలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు మరాఠీ భాష తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం చేపట్టిన చర్యలు నగర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. ఈ క్రమంలో వేలాది మంది ఆటో డ్రైవర్లు ముంబయి, థాణేను వీడుతున్నట్లు తెలుస్తోంది. బిహార్, యూపీ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన డ్రైవర్లు స్వస్థలానికి తరలి వెళ్లిపోతున్నట్లు సమాచారం. ముంబయి మహానగర ప్రాంతంలో సోమవారం ఉదయం ఆటోల కొరత తీవ్రంగా కనిపించింది. ముఖ్యంగా నివాస ప్రాంతాలను రైల్వే స్టేషన్లతో కలిపే మార్గాల్లో ఆటోలు అందుబాటులో లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు నిత్యం ఆటోలను ఆశ్రయించే ఉద్యోగులు, విద్యార్థులు రవాణా కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. మరాఠీ భాషా నైపుణ్యంపై ఆర్టీవో తనిఖీలు ముమ్మరం కావడంతో కొందరు డ్రైవర్లు కీలక మార్గాల్లో ఆటోలు నడపడానికి వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. మరాఠీపై పరిజ్ఞానం లేకపోతే తొలుత నోటీసులు జారీ చేస్తా మని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ ఇటీవల తెలిపారు. నోటీసు ఇచ్చిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే డ్రైవర్ లైసెన్స్, బ్యాడ్జిని మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తామని చెప్పారు. మూడు నెలల తర్వాత కూడా మరాఠీ పరిజ్ఞానం సాధించకపోతే లైసెన్స్, బ్యాడ్జి రద్దుకు ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ నిబంధనపై కొందరు డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రయాణికులకు స్థానిక భాషలో సేవలు అందించేందుకు ఈ చర్యలు అవసరమని ప్రభుత్వం చెబుతోంది.

## 11న బ్యాంకుల సమ్మె.. నాలుగు రోజులు బంద్!

**ఢిల్లీ** : దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంతరాయం ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలులో జాప్యం, పనితీరు ఆధారిత ప్రోత్సాహక పథకంపై విభేదాలు, పెన్షన్‌కు సంబంధించిన డిమాండ్లు పరిష్కారం కాకపోవడాన్ని నిరసిస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. సమ్మె అమల్లోకి వస్తే ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల శాఖల కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. సెప్టెంబర్ 11 శుక్రవారం. ఆ తర్వాత సెప్టెంబర్ 12 రెండో శనివారం, 13 ఆదివారం కావడంతో బ్యాంకింగ్ సేవలకు వరుసగా అంతరాయం ఏర్పడొచ్చు. మరోవైపు సెప్టెంబర్ 14న గణేశ్ చతుర్థి సందర్భంగా కొన్ని రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో బ్యాంకు శాఖలు వరుసగా నాలుగు రోజులపాటు మూసి ఉండే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది.

**సెప్టెంబర్‌లో మరో భారీ సమ్మె** : సెప్టెంబర్ 11తో ఆందోళన ఆగదని యూనియన్స్ ఫోరం స్పష్టం చేసింది. డిమాండ్లపై పురోగతి లేకపోతే సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు దిగుతామని ప్రకటించింది. ఈ సమ్మె సెప్టెంబర్ 28--30 తేదీల్లో జరగనుంది. సెప్టెంబర్ 28న అర్ధవార్షిక ముగింపు కార్యకలాపాలు ఉండటం వల్ల బ్యాంకింగ్ రంగంపై దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉండొచ్చని యూనియన్లు భావిస్తున్నాయి. ఇక డిమాండ్లు పరిష్కారం కాకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లాలని యూనియన్స్ ఫోరం నిర్ణయించింది.

**ఖాతాదారులు ఏం చేయాలి?** : సెప్టెంబర్‌లో వరుస సమ్మె పిలుపుల నేపథ్యంలో చెక్కులు, నగదు లావాదేవీలు, బ్యాంకు శాఖల్లో చేయాల్సిన ఇతర అత్యవసర పనులను ముందుగానే పూర్తి చేసుకోవడం మంచిది. అయితే UPI, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం వంటి డిజిటల్ సేవలు సాధారణంగా బ్యాంకుల సమ్మె ఉన్నప్పటికీ పనిచేసే అవకాశం ఉంటుంది. అత్యవసర లావాదేవీల కోసం ఖాతాదారులు ప్రత్యామ్నాయ డిజిటల్ మార్గాలను సిద్ధంగా ఉంచుకోవడం మంచిది.

## భారీ వర్షం.. పదుల సంఖ్యలో విమానాల దారి మళ్లింపు

**న్యూఢిల్లీ:** కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఢిల్లీలో జనజీవనం స్తంభించింది. ప్రతికూల వాతావరణం, లో-విజిబిలిటీ వల్ల విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఢిల్లీ విమానాశ్రయంలో దిగాల్సిన 15 విమానాలను అధికారులు అత్యవసరంగా ఇతర నగరాలకు దారి మళ్లించారు. జైపూర్ 12, చండీగఢ్ రెండు, లక్నో ఒక విమానాన్ని దారి మళ్లించంగా.. ట్రాఫిక్ నియంత్రణ, ప్రతికూల వాతావరణం వల్ల విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌లలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పలు సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. మరోవైపు రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే గంటల్లో మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఢిల్లీ పరిసర ప్రాంతాలకు వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. ప్రయాణికులు తమ విమాన సమయాల గురించి సంబంధిత ఎయిర్‌లైన్స్ సంస్థలను సంప్రదించి బయలుదేరాలని అధికారులు సూచించారు.

# ఈ ప్రాథమిక వైద్య పరికరాలు ప్రతి ఒక్కరి ఇంట్లో ఉండాల్సిందే..



ఇంట్లో పిల్లలు, వృద్ధులు లేదా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఉంటే రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ స్థాయి వంటి కీలక ఆరోగ్య సూచీలను ఎప్పటికప్పుడు గమనించడం చాలా ముఖ్యం. ఇందుకోసం కొన్ని ప్రాథమిక వైద్య పరికరాలను ఇంట్లోనే ఉంచుకోవడం అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుంది. అయితే ఈ పరికరాల్లో అసాధారణ రీడింగ్ కనిపించగానే భయపడకుండా, ప్రశాంతంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ థర్మామీటర్, బీపీ మానిటర్, పల్స్ ఆక్సీమీటర్, అవసరమైతే గ్లూకోమీటర్, నెబ్యులైజర్, అలాగే ఫస్ట్ ఎయిడ్ కిట్ ప్రతి ఇంట్లో ఉండటం మంచిది. ఇవి ఆరోగ్య పరిస్థితిలో వచ్చే మార్పులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు సహాయపడతాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిలో ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అత్యవసర సమయంలో కుటుంబ సభ్యుల్లో భయాందోళనలు తగ్గించి, వైద్యులకు సరైన సమాచారం అందించడంలో కూడా ఈ పరికరాలు ఉపయోగపడతాయి.

### హెచ్చరికగా భావించాలి..

అయితే ఏదైనా పరికరంలో అసాధారణ రీడింగ్ కనిపించిన వెంటనే అది తీవ్రమైన సమస్య అని భావించకూడదు. మొదట కనిపించిన రీడింగ్‌ను ఒక హెచ్చరికగా మాత్రమే పరిగణించి, మరో సారి సరిచూసుకోవడం అవసరం. ఎందుకంటే కొన్నిసార్లు పరికరాన్ని సరిగా ఉపయోగించకపోవడం లేదా ఇతర కారణాల వల్ల కూడా తప్పుడు రీడింగ్ వచ్చే అవకాశం ఉంటుంది. రక్తపోటు ఎక్కువగా లేదా చాలా తక్కువగా కనిపిస్తే ముందుగా కొద్దిసేపు ప్రశాంతంగా కూర్చొని మళ్లీ బీపీని పరీక్షించాలి. డైనింగ్ కుర్చీలో నిటారుగా కూర్చొని, చేతిని టేబుల్‌పై సపోర్ట్ ఇచ్చి కొలిస్తే సరైన ఫలితం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆందోళన, నొప్పి, ఇటీవల చేసిన శారీరక శ్రమ, బీపీ కఫ్‌ను సరిగా ధరించకపోవడం వంటి కారణాల వల్ల కూడా రీడింగ్ మారుతుంది. అలాగే బీపీ కొలిచే ముందు కనీసం గంటపాటు టీ, కాఫీ తాగకుండా ఉండాలి. దగ్గు మందులు, ముక్కు దిబ్బడ తగ్గించే మందులు లేదా నెబ్యులైజేషన్ వాడిన తర్వాత కూడా బీపీ, పల్స్ తాత్కాలికంగా పెరిగే అవకాశం ఉంటుంది.

### రీడింగ్ అసాధారణంగా ఉంటే..

గ్లూకోమీటర్‌లో రక్తంలో చక్కెర స్థాయి ఒక్కసారిగా ఎక్కువగా లేదా తక్కువగా కనిపిస్తే ముందుగా చేతులను శుభ్రంగా కడిగి మళ్లీ పరీక్షించాలి. వేళ్లపై ఆహార అవశేషాలు లేదా శానిటైజర్, స్పిరిట్ అవశేషాలు ఉండటం వల్ల కూడా తప్పు రీడింగ్ వస్తుంది. చెమటలు పట్టడం, తల తిరగడం, అయోమయం, తీవ్రమైన దాహం వంటి లక్షణాలు కూడా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. మరో వేలితో మళ్లీ పరీక్షించడం లేదా సాధ్యమైతే మరో గ్లూకోమీటర్‌తో పోల్చి చూడడం కూడా మంచిది. థర్మామీటర్‌లో అధిక జ్వరం నమోదైతే ముందుగా ఉష్ణోగ్రతను సరిగ్గా కొలిచామా లేదా అని నిర్ధారించుకోవాలి. శరీరానికి తగినంత నీరు అందేలా చూసుకోవాలి. జ్వరం ఎక్కువసేపు కొనసాగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అయోమయం లేదా ఫిట్స్ వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందాలి.

### లక్షణాలు కూడా ఉంటే..

పల్స్ ఆక్సీమీటర్‌లో ఆక్సిజన్ స్థాయి తక్కువగా కనిపిస్తే చేతులను వెచ్చగా ఉంచి, కదలకుండా కొద్దిసేపు ఉండి మళ్లీ పరీక్షించాలి. చల్లని వేళ్లు, రక్తప్రసరణ సరిగా లేకపోవడం లేదా పరికరాన్ని సరిగ్గా అమర్చకపోవడం వల్ల కూడా తక్కువ రీడింగ్ వస్తుంది. మళ్లీ పరీక్షించిన తర్వాత కూడా ఆక్సిజన్ స్థాయి తక్కువగానే ఉండి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. ఆరోగ్య పరికరాలు చూపించే సంఖ్యలు ఉపయోగకరమైన సూచనలు మాత్రమే. వాటితోపాటు శరీరంలో కనిపించే లక్షణాలను కూడా తప్పనిసరిగా గమనించాలి. అసాధారణ రీడింగ్ కనిపించినప్పుడు భయపడకుండా మరోసారి పరీక్షించి, అవసరమైతే వెంటనే వైద్య సలహా తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# 'ఏఐ రిస్క్ ఫండ్' నేటి తరం అత్యవసరం!




**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మన కళ్ల ముందే సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిస్తోంది. నిత్యం చేసే పనులు, డేటా విశ్లేషణ వంటి రంగాలను ఏఐ వేగంగా భర్తీ చేస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో సంప్రదాయ ఉద్యోగాల సంఖ్య తగ్గే ప్రమాదం ఉంది. ఫలితంగా, కాలేజీ పూర్తి చేసుకుని బయటకొచ్చే యువతకు మొదటి ఉద్యో గం సంపాదించడం మునుపటి కంటే సవాలుగా మారవచ్చు. మారుతున్న కాలంలో పిల్లలను కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చుకునే యంత్రాలుగా మార్చకుండా.. సృజనాత్మకంగా ఆలో చించేలా, సరికొత్త నైపుణ్యాలు పెంపొందించుకునేలా, ఏఐతో కలిసి పనిచేసేలా తీర్చిదిద్దడం తల్లిదండ్రుల ప్రాథమిక బాధ్యత అని నిపుణులు చెబుతున్నారు.**

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పిల్లల భవి ష్యత్తు కోసం 'ఏఐ రిస్క్ ఫండ్' లేదా ఒక ప్రత్యేకమైన పొదుపు ఖాతాను ఏర్పాటు చేయడం ఇప్పుడు చాలా అవసరం. పిల్లల పెళ్లిళ్లకు, కాలేజీ ఫీజులకు డబ్బు దాచినట్లే.. ఏఐ యుగంలో వారి కెరీర్ స్థిరపడే వరకు ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకోవడానికి ఒక 'రిస్క్ మేనేజ్‌మెంట్ ఫండ్' అవసరమని తల్లిదండ్రులు గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు. గతాన్ని గమనిస్తే, ఏ కొత్త సాంకేతికత వచ్చినా పాత ఉద్యోగాలను తుడిచేసి, సరికొత్త అవకాశాలను సృష్టిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే, పాతవి పోవడానికి, కొత్తవి పుట్టుకురావడానికి మధ్య కొంత సమయం పడుతుంది. ఈ లోపు పిల్లలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పడకుండా నిలబడడానికి ఈ 'రిస్క్ ఫండ్' ఒక సంజీవనిలా పనిచేస్తుంది. ఒకప్పుడు మంచి మార్కులు, పెద్ద డిగ్రీలు ఉంటే ఉద్యోగం గ్యారంటీ అనే నమ్మకం ఉండేది. కానీ నేడు కేవలం మార్కులు సరిపోవు. ఏఐ యుగంలో రాణించాలంటే సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, వినూత్న ఆలోచనలు ప్రాణాధారాలు. పిల్లలు ఏఐని చూసి భయపడకుండా, దానిని ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగించడం నేర్చుకోవాలి. ముఖ్యంగా, ఏఐ నుంచి సరైన సమాధానాలు రాబట్టడానికి 'సరైన ప్రశ్నలు అడగడం' అనేది అత్యంత కీలకమైన నైపుణ్యంగా మారబోతోంది.

పిల్లలు చదివిన చదువుకు సంబంధించిన ఉద్యోగం ఏఐ వల్ల మారిపోతే, వారు తక్షణమే మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా కొత్త టెక్నాలజీని (ఏఐ టూల్స్, డేటా అనలిటిక్స్ మొదలైనవి) నేర్చుకోవడానికి ఈ డబ్బు ఉపయోగపడుతుంది. చదువు పూర్తి కాగానే వెంటనే ఉద్యోగం రాకపోయినా, ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా, తదుపరి కెరీర్ ప్లాన్ చేసుకోవడానికి ఈ ఫండ్ ఒక రక్షణ కవచంలా నిలుస్తుంది. భవిష్యత్తులో ఉద్యోగాల కోసం వెతకడం కంటే, సొంతంగా ఏఐ టూల్స్ ఉపయోగించి స్టార్టప్‌లు లేదా సరికొత్త వ్యాపారాలు ప్రారంభించడానికి ఈ పొదుపు మొత్తమే తొలి పెట్టుబడిగా మారుతుంది.

# 'ఎగిరే రాడార్'కు లైన్ క్లియర్

**బెంగళూరు:** శత్రువుల క్షిపణులు, డ్రోన్లు, విమానాలను ఓ కంట కనిపెడుతూ భూతలం మీది భారత బలగాలకు సమాచారం చేరవేసి అప్రమత్తంచేసే 'ఆకాశ రాడార్'గా రికార్డ్ నెలకొల్పనున్న భారత తొలి స్వదేశీ ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ 'నేత్ర'భారత వాయుసేన చేతికొచ్చింది. ఇకపై ఈ వ్యవస్థతో అత్యంత ఎత్తుల్లో ప్రయాణించే విమానాన్ని రణక్షేత్రంలో వినియోగించుకునేందుకు రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ తుది అనుమతి మంజూరుచేసింది.

సంబంధిత ఫైనల్ ఆపరేషన్ క్లియరెన్స్(ఎఫ్‌ఓసీ) సర్టిఫికేట్‌ను భారత వాయుసేనకు గురువారం డీఆర్‌డీవో అందజేసింది. బెంగళూరులో జరిగిన ఈ కార్యక్రమంలో ఎయిర్ స్టాఫ్ డెప్యూటీ చీఫ్, ఎయిర్ మార్షల్ అవధీశ్ కుమార్ భారతి పాల్గొని ప్రసంగించారు. "ఏఈడబ్ల్యూసీకి తుది అనుమతి రావడం ఎంతో గర్వంగా ఉంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే కాదు గగనతల రక్షణంలో భారత వాయుసేన సాధించబోయే స్వావలంభన, ఆత్మనిర్భరతకు ఇది మరో ముందడుగు.

ఎర్లీ వార్నింగ్ వ్యవస్థ ప్రస్థానం అసాధారణం. ఎన్నో సవాళ్లను అధిగమించి ఇక్కడి దాకా వచ్చాం. ఇంకా ఎన్నో ఆవిష్కరణలు చేయాల్సి ఉంది. భారత వాయుసేన, డీఆర్‌డీఓ, సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టిమ్స్ తదితర విభాగాల శాస్త్రవేత్తల సమష్టి కృషికి సంబరం చేసుకోవాల్సిన రోజు ఇది"అని ఆయన అన్నారు.



ఏఈడబ్ల్యూసీ అనేది విమానంలో ఉండే పలు రకాల సెన్సార్ల సమాహారం. ఇందులో రాడార్, ఎలక్ట్రానిక్ యుద్ధతంత్ర వ్యవస్థలు, అత్యంత భద్రమైన కమ్యూనికేషన్ వ్యవస్థలు ఉంటాయి. ఈ విమానాన్ని శత్రువులు గుర్తిస్తే శత్రు దాడుల నుంచి తనను తాను కాపాడుకునే రక్షణ వ్యవస్థలూ ఈ విమానంలో ఉంటాయి. భవిష్యత్తులో నేత్రా వ్యవస్థను ఆరు విమానాల్లో అమర్చనున్నారు.

## వికసిత్ భారత్ లక్ష్యాలు.. బ్యాంకింగ్‌పై త్వరలో ఉన్నతస్థాయి కమిటీ




**ఢిల్లీ** : 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో బ్యాంకింగ్ రంగం పాత్రను సమీక్షించేందుకు త్వరలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ కమిటీ బ్యాంకింగ్ రంగానికి భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. రాబోయే రెండు దశాబ్దాల్లో దేశాభివృద్ధికి అవసరమైన మార్పులను కమిటీ సూచిస్తుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల సదస్సులో ఆమె మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో చేపట్టాల్సిన సంస్కరణలపై తమ సిఫార్సులు, సూచనలు అందించాలని ఈ సందర్భంగా బ్యాంకు అధిపతులను కేంద్రమంత్రి కోరారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడానికి ఇంకా కేవలం 20 ఏళ్లు మాత్రమే ఉన్నాయని నిర్మలా సీతారామన్ అన్నారు. కాబట్టి ఈ తక్కువ సమయంలో బ్యాంకింగ్ రంగాన్ని అందుకు అనుగుణంగా సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం నిరర్ధక ఆస్తులు కనిష్ఠ స్థాయికి చేరాయన్నారు. కాబట్టి రాబోయే రెండు దశాబ్దాల ఆర్థిక వృద్ధికి అవసరమైన సంస్కరణలను వేగవంతం చేయడానికి ఇదే సరైన సమయమని ఆమె పేర్కొన్నారు. బ్యాంకింగ్ అంశంపై కాన్‌క్లేవ్‌లో చర్చించాల్సిన ఏడు అంశాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ గుర్తించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. యువతకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయడం, పెట్టుబడుల ప్రోత్సాహం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ప్రాధాన్య రంగాలకు రుణాలు, క్రెడిట్ కార్డు వ్యాపార పునర్నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా యువతపై దృష్టి సారించాలని బ్యాంకులకు సూచించారు. తమ ప్రణాళికల్లో డెమోగ్రఫిక్ ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని నిర్మలా సీతారామన్ తెలిపారు.

## పాత వాహనాలకు ఈ10 పెట్రోల్..

**ఢిల్లీ** : ఇథనాల్ కలిపిన పెట్రోల్ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోన్న వేళ.. ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి. అనంత నాగేశ్వరన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాత వాహనాల కోసం ఈ10 పెట్రోల్‌ను అందుబాటులోకి తేవాలని సూచించారు. బీఎస్-4కు ముందు తయారైన వాహనాలు దేశంలో 7.5 కోట్ల నుంచి 8 కోట్ల వరకు ఉన్నాయని అంచనా వేశారు. ఇథనాల్ మోతాదు ఎక్కువగా ఉండే పెట్రోల్‌తో ఆ వాహనాల్లో ఇంజిన్ ఎక్కువ వేడెక్కే ప్రమాదం ఉందని.. పాత రబ్బరు భాగాలపై అది ప్రభావం చూపొచ్చని పేర్కొన్నారు. ఈ వాహనాలను ఇథనాల్‌కు అనుగుణంగా మార్చడం సాధ్యమే అయినా.. అందుకు ఎక్కువ సమయం పడుతుందని వివరించారు. అప్పటి వరకు ఇథనాల్ మోతాదు తక్కువ ఉండే ఈ10 పెట్రోల్‌ను ప్రత్యామ్నాయంగా అందించాలన్నారు. పాత వాహనాల్లో ఈ20 పెట్రోల్ పనిచేస్తుందా? లేదా? అనేది ఒక్కటే ఇక్కడ సమస్య కాదని అనంత నాగేశ్వరన్ అన్నారు. ఇథనాల్ బ్లెండింగ్ వల్ల ఆహార భద్రత, భూమి, నీటి లభ్యతపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్న అంశాలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో సమీక్షించాలని సూచించారు. ఇథనాల్ ఉత్పత్తికి అవసరమయ్యే పంటలకు డిమాండ్ పెరిగితే.. ఆహారం, పశుదాణాకు వాటి లభ్యత తగ్గే ప్రమాదం ఉందని గుర్తుచేశారు. ఈ20 ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్నప్పటికీ.. ఆహారం, ఇంధనం, నీటి వినియోగం మధ్య సమతుల్యతను పాటించడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. దానికి అనుగుణంగానే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

## భాజపా ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి..




**ఢిల్లీ** : భాజపా నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులతో పాటు వివిధ పదవులకు ఎంపికైన వారి జాబితాను ప్రకటించింది. భాజపా జాతీయ ఉపాధ్యక్షుల జాబితాలో కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే సింధియాతో పాటు తీరత్ సింగ్ రావత్, రామ్ మాధవ్, వైజయంత్ జయ్ పాండా, రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్, భారతీ ప్రవీణ్ పవార్, సర్దార్ మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్య, ఎం.నాగరాజ, తారిఖ్ మన్సూర్, మధుచంద్ర కర్ ఉన్నారు. వీరంతా భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో పనిచేయనున్నారు. అలాగే, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా నియ మితులై భాజపాలో కీలకమైన సంస్థాగత బాధ్యతల్లోకి తిరిగి వచ్చారు.

- జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి పదవి బీఎల్ సంతోష్‌కు దక్కింది.
- జాతీయ సంస్థాగత సంయుక్త ప్రధాన కార్యదర్శులు: శివప్రకాశ్, సౌధాన్ సింగ్
- జాతీయ ప్రధాన కార్యదర్శులు: వినోద్ తావ్డే, సునీల్ బన్సల్, విప్లవ్ కుమార్ దేవ్, స్మృతి ఇరానీ, డాక్టర్ సతీశ్ పునియా, గజేంద్ర పటేల్, హరీశ్ ద్వివేదీ, సంజయ్ భాటియా నియమితులయ్యారు.
- జాతీయ కార్యదర్శులు: కవిత పాటీదార్, కె.సురేంద్రన్, డాక్టర్ భోలాసింగ్, డాక్టర్ ప్రదీప్ వర్మ, జగదీశ్ ఈశ్వరభాయ్ పటేల్, డాక్టర్ సందీప్ పాఠక్, ఫాంగ్నోన్ కొన్యక్, సంగీతా యాదవ్, అనిల్ ఆంటోనీ, ఎం.వెంకటేషన్, మనోజ్ తిగ్గా, సిద్ధార్థ్ శంబు, స్వదేశ్ సింగ్, మృగాంగ్ దేవ్ బర్మన్, రోహన్ గుప్తా, జై ప్రకాశ్
- జాతీయ కోశాధికారిగా పీయూష్ గోయల్ నియమితులయ్యారు. సంయుక్త కోశాధికారి పదవికి రాజేశ్ మంగల్‌ను పార్టీ ఎంపిక చేసింది.
- త్వరలో కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కేంద్రమంత్రి రామ్‌దాస్ అఠవాలే వెల్లడించారు. భాజపా, మిత్రపక్షమైన ఎన్‌సీపీకి చెందిన కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. సంస్థాగత మార్పులు చేసిన నేపథ్యంలో కొత్తవారికి చోటు దక్కే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. తాజాగా ప్రకటించిన జాతీయస్థాయి పదవుల్లో తెలంగాణ నుంచి ఎవరికీ చోటు దక్కకపోవడం గమనార్హం.

- ఏపీపీఎస్సీ గ్రూప్-1లో ఎలాంటి అవకతవకలూ జరగలేదు..
- చంద్రబాబు వేసిన సిట్ ఇదే విషయం చెప్పింది..
- అయినా ఎందుకు దుష్ప్రచారం
- డీఎస్సీ విచారణకు సిద్ధమైతే దర్యాప్తు సంస్థకు లేఖ రాయండి
- చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు జగన్ ఓపెన్ చాలెంజ్

**అమరావతి :** ఏపీపీఎస్సీ గ్రూప్-1లో ఎలాంటి అవకతవకలు జరగలేదని చంద్రబాబు వేసిన సిట్ చెప్పిందని.. అయినా దుష్ప్రచారం ఆపడం లేదని కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ క్రమంలో ఆయన సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఓపెన్ చాలెంజ్ విసిరారు. గురువారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్‌జగన్ మీడియాతో మాట్లాడుతూ.. "ఏపీపీఎస్సీ గ్రూప్-1 చంద్రబాబు హయాంలో రిలీజ్ అయిన నోటిఫికేషన్. ఎన్నికల ముందు హడావిడిగా ఆయన దానిని రిలీజ్ చేశారు. మేం అధికారం చేపట్టక ముందే ప్రిలిమ్స్ జరిగాయి. ప్రిలిమ్స్‌లో పాసైన వాళ్లకే మేం మెయిన్స్, ఇంటర్వ్యూలు నిర్వహించాం. ఎలాంటి అవకతవకలు జరగలేదని.. చంద్రబాబు వేసిన సిట్ చెప్పింది. వాల్యూయేషన్‌లో ఎలాంటి తప్పులు జరగలేదని తేల్చి చెప్పింది.



# నేను సిద్ధం.. మీరు సిద్ధమేనా?



అయినా కూడా పదే పదే తప్పుడు ప్రచారాలు చేశారు. అసలు ఏపీపీఎస్సీలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చిన ఘనత మాది. మరి బాబు హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ ఫలితాలను బయటపెట్టగలరా?" అని సవాల్ విసిరారు. "గ్రామ సచివాలయాల్లో లక్షా 30 వేల ఉద్యోగాలిచ్చాం. మా హయాంలో 78 నోటిఫికేషన్లతో 6,296 ఉద్యోగాలిచ్చాం. ఒక్క ఆరోపణ అయినా వచ్చిందా?" అని ప్రశ్నించారు. "మా హయాంలో నిర్వహించిన 2018 గ్రూప్-1పై సీబీఐ దర్యాప్తునకు నేను రెడీ.. మీ హయాంలో జరిగిన 2025 డీఎస్సీపై సీబీఐ దర్యాప్తునకు మీరు సిద్ధమా?" అని చంద్రబాబుకి వైఎస్ జగన్ ఓపెన్ చాలెంజ్ విసిరారు.

## శాసనసభలో చర్చ ఎందుకు పెట్టడం లేదు?

ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది జరిగిన మెగా డీఎస్సీ 2025లో అనేక అక్రమాలు జరిగాయని వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి మరోసారి ఆరోపించారు. దీనిపై మండలిలో ప్రభుత్వం చర్చ పెట్టకుండా శాసనసభలో చర్చ పెట్టడాన్ని తప్పు పట్టారు. అయితే అక్కడ తాము చేసిన తప్పులను ఒప్పుకున్నారని, అక్రమాలు జరిగాయని వారే అంగీకరించారని అన్నారు. అందుకే దీనిపై సమగ్ర విచారణ జరిపేందుకు సీబీఐ విచారణకు కోరుతున్నామని, విద్యాశాఖ మంత్రిగా ఉన్న లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ విషయంలో లీకేజీ, అక్రమాలపై తాము ఇప్పటివరకూ ఏ అంశాలను అయితే ప్రజలముందు ఉంచామో, అవన్నీ వాస్తవమని క్రమంగా ప్రభుత్వమే అంగీకరించే పరిస్థితిలోకి వచ్చిందన్నారు. తప్పు చేశారు కాబట్టి.. గింజుకుంటారే తప్ప, సీబీఐ విచారణకు మాత్రం ముందుకు రావడంలేదని అన్నారు. అలాంటివి సభలో ప్రశ్నిస్తామని గ్రహించే తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని తెలిపారు. "ఇవన్నీ గట్టిగా లేవనెత్తుతామనే మాకు ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వడంలేదు. చివరకు ప్రతిపక్షం లేకుండానే సభను నడుపుతున్నారు. ప్రత్యర్థి జట్టు లేనిచోట, బౌలింగ్, ఫీల్డింగ్ లేకుండా, తండ్రీ కొడుకులు ఇద్దరూ బ్యాటింగ్ చేస్తున్నారు. తాము అద్భుతంగా చేశామని చెప్తున్నారు. డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై చర్చ కావాలంటూ నాలుగు రోజులపాటు శాసనమండలిని మా ఎమ్మెల్సీలు స్తంభింపచేశారు. కానీ, అక్కడ డిస్కషన్ చేయడానికి ముందుకు రావడంలేదు. ఎందుకు కౌన్సిల్లో చర్చకు ఒప్పుకోలేదంటే, కారణం డీఎస్సీలో తప్పులు జరిగాయి కాబట్టి, సీబీఐ విచారణ చేయాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది కాబట్టి, జరిగిన దానికి బాధ్యత వహిస్తూ లోకేష్ రాజీనామాచేసి తప్పుకోవాల్సిన అవసరం కూడా ఉంది కాబట్టి." అని అన్నారు.

## లోకేశ్ స్వయంగా ఒప్పుకున్నారు..

డీఎస్సీ పరీక్షల ప్రశ్నల తయారీ-పరీక్ష నిర్వహణ రెండూ ఒకే అధికారి చేతిలో పెట్టినట్టు లోకేష్ స్వయంగా అంగీకరించారని జగన్ వీడియో ప్లే చేసి చూపించారు. తాము ప్రశ్నించిన కీలక అంశాల్లో ఇది కూడా ఒకటని గుర్తు చేశారు. తాము లేవనెత్తిన అంశాన్ని అంగీకరించడమే కాకుండా, తప్పేముంది అని దబాయించారని మండిపడ్డారు. "డీఎస్సీ పరీక్షలకు అవసరమైన ప్రశ్నల తయారీ అనేది ఎస్.సి.ఈ.ఆర్.టి డైరెక్టర్ బాధ్యత, డీఎస్సీ పరీక్షను నిర్వహించే బాధ్యత డీఎస్సీ కన్వీనర్‌ది. ఈ రెండూ, ఒకే వ్యక్తికి అప్పగించడం ద్వారా పారదర్శకతకు పాతరవేసి, లీకేజీకి స్వయంగా ద్వారాలు తెరిచారు. స్కాం ఇక్కడ నుంచే మొదలుపెట్టార్నది చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రశ్నలు తయారుచేసే వ్యవస్థకు, పరీక్ష నిర్వహించే వ్యవస్థకు మధ్య ఉండాల్సిన చెక్స్ అండ్ బ్యాలెన్స్ ఎందుకు తొలగించారో దర్యాప్తు జరగాలి, అంతేకాదు, ఒకే వ్యక్తి చేతిలో రెండు కీలక బాధ్యతలు ఎందుకు పెట్టారో తేలాలి? అందుకే సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నాం." అని అన్నారు.

మెగా డీఎస్సీ అక్రమాలు అంగీకరించినందున సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నామని జగన్ తెలిపారు. విద్యామంత్రి లోకేష్ బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నల తయారీ, పరీక్ష నిర్వహణ ఒకే అధికారికి అప్పగించడాన్ని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా నిరాకరణ అక్రమాలను దాచడానికేనని జగన్ అన్నారు. డీఎస్సీ ప్రశ్న పత్రాలు తయారు చేసే విభాగంలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌కు ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చిందని జగన్ ప్రశ్నించారు. ఆయనకు ఉద్యోగం ఇవ్వకుండా, ఆయన లాగిన్ ఐడీని ఎందుకు బ్లాక్ చేశారని నిలదీశారు. అంతేకాకుండా ఆ వ్యక్తి

## అందుకే సీబీఐ విచారణ

సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు రాలేదని బుకాయిస్తున్నారని అన్నారు. లీకేజీ ఆయనతోనే ఆగిపోయిందా ఆయన ద్వారా ఇంకా ఎవరికైనా చేరిందా అనేది తేలాలని డిమాండ్ చేశారు. అందుకే సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. "సీబీఐ విచారణ జరిపించాలని ప్రధాని మోదీకి లేఖ రాశాం. కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేశాం. సీబీఐ విచారణ చేయించాలని కోర్టును కూడా ఆశ్రయించాం. సవాల్‌కు సిద్ధమైతే.. విచారణకు సిద్ధమైతే దర్యాప్తు సంస్థకు లేఖ రాయండి" అని వైఎస్ జగన్ అన్నారు.

---

## 'అందుకే చంద్రబాబు సర్కార్ తోకముడిచింది'

**విజయవాడ:** గత నాలుగు రోజులుగా డీఎస్సీపై ప్రభుత్వం చర్చకు రాలేదని మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. గురువారం ఆయన శాసనమండలి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. డీఎస్సీలో అవకతవకలు న్నాయనే మేం విచారణ జరిపించాలని కోరాం. మార్కెట్‌లో వస్తువుల్లా ఉద్యోగాలు అమ్ముకున్నారు. డీఎస్సీలో అవకతవకలు జరిగింది వాస్తవం.. అందుకే ప్రభుత్వం తోకముడిచింది" అని బొత్స పేర్కొన్నారు. "డీఎస్సీతో పాటు గ్రూప్-1 పైన కూడా సీబీఐ విచారణ జరిపించండి. 1998 డీఎస్సీలో 5887 మందికి ఉద్యోగాలిచ్చింది మేమే. 2008 డీఎస్సీలో 2193 మందికి ఉద్యోగాలిచ్చింది కూడా మేమే. 2019లో స్పెషల్ డీఎస్సీ నిర్వహించి 521 మందికి ఉద్యోగాలిచ్చాం. 1250 మంది కేజీబీవీ టీచర్లకు ఉద్యోగాలు కల్పించాం. మార్కెట్‌లో ఉద్యోగాలు అమ్ముకుని అండపిండ బ్రహ్మాండం బద్దలైపోయినట్లు డాంబికం ఎందుకు?. ఈ ప్రభుత్వం పనైపోయింది. రెండేళ్లలోనే ప్రభుత్వం మోసం తెలిసిపోయింది. ..మాట్లాడితే సవాళ్లు విసురుతారు.. చర్చకు రమ్మంటే రారు. ప్రజల సమస్యల పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే సభలో చర్చించాలని కోరాం. మీలా ప్రతిదీ రాజకీయ కోణంలో మేం చూడలేం. మా ఇంటికొస్తే మీరు ఏం తెస్తారు.. మీ ఇంటికొస్తే మాకేమిస్తారు అనేలా ఉంది ప్రభుత్వం తీరు. రెండేళ్లలోనే లక్ష మంది విద్యార్థులు ఎందుకు తగ్గారు?. విద్యావ్యవస్థలో లోపం ఉంది కాబట్టే ప్రైవేట్‌కు తరలిపోయారు. ..విద్యా వ్యవస్థను బలోపేతం చేసింది వైఎస్ జగన్. నాడు నేడు పెట్టి స్కూల్స్ రూపురేఖలు మార్చింది వైఎస్ జగన్. ఐబీ వంటి సిలబస్‌లు పెట్టి విద్యా ప్రమాణాలు పెంచింది వైఎస్ జగన్. జగన్ గోరుముద్ద ద్వారా మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారం అందించాం. వైఎస్ జగన్ అమ్మ ఒడిని సక్రమంగా అమలు చేశారు" అని బొత్స వివరించారు.

## వైయస్ జగన్‌ను కలిసిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



**అమరావతి :** వైయస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాల యంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్‌ను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. 23 రోజుల పాటు శ్రీకాకుళం జైలులో ఉన్న సీదిరి అప్పలరాజుతో వైయస్ జగన్ ఆత్మీయంగా మాట్లాడి, జైలు నుంచి విడుదలైన అనంతరం ఎదురైన పరిస్థితుల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పలరాజుకు ధైర్యం చెప్పారు.

**అన్ని విధాలా అండగా ఉంటాం :** రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ఉండాలని వైయస్ జగన్ సూచించారు. వైయస్‌ఆర్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎలాంటి పరిస్థితుల్లోనూ పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని సీదిరి అప్పలరాజుకు భరోసా ఇచ్చారు. అప్పలరాజు కుటుంబ సభ్యులతోనూ వైయస్ జగన్ మాట్లాడి ధైర్యం చెప్పారు. కుటుంబానికి పార్టీ నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు కుటుంబ సభ్యులు వైయస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## డీఎస్సీపై చర్చ జరగాల్సిందే..

**తాడేపల్లి:** డీఎస్సీ అక్రమాలపై శాసనమండలిలో చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ వైయస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు. మెడలో నల్ల కండువాలు ధరించి ర్యాలీగా శాసనమండలికి బయలుదేరిన ఎమ్మెల్సీలు.. డీఎస్సీపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. డీఎస్సీపై విచారణ చేయాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. "మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ" అంటూ నినాదాలతో నిరసన చేపట్టారు. శాసనమండలిలోకి చేరుకున్న అనంతరం పోడియం వద్దకు వెళ్లి ఆందోళన కొనసాగించారు. మండలి వాయిదా పడినా నిరసనను విరమించకుండా నేలపై కూర్చొని డీఎస్సీ అక్రమాలపై చర్చ జరపాలని పట్టుబట్టారు.

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ డీఎస్సీపై చర్చ జరపాలని కోరుతున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం



కనిపించడం లేదన్నారు. తప్పు చేశారు కాబట్టే ప్రభుత్వం చర్చకు భయపడుతోందని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు పరీక్ష లేకుండానే ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి లోకేష్ చెబుతున్నారని తెలిపారు. టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఢిల్లీ వెళ్లి కోరిన టీచర్లను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. తక్షణమే టీచర్లపై విధించిన సస్పెన్షన్లను ఎత్తివేయాలని, డీఎస్సీపై సీబీఐ విచారణ జరిపించాలని స్పష్టం చేశారు.

## పట్టాలపైకి గజరాజుల దండు



**హోజాయ్:** అస్సాంలోని హోజాయ్ జిల్లాలో రైల్వే ట్రాక్‌ను దాటుతున్న అడవి ఏనుగుల గుంపును గమనించిన లోకో పైలట్, అప్రమత్తతతో రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను సకాలంలో నిలిపివేసి పెను ప్రమాదాన్ని నివారించారు. బుధవారం ఉదయం లంకా రేంజ్ పరిధిలోని హవైపూర్ ప్రాంతంలో (కిలోమీటర్ 167/8 వద్ద) ఈ ఘటన చోటుచేసుకుంది. డౌన్ రాజధాని ఎక్స్‌ప్రెస్ ఆ మార్గంలో వస్తున్న సమయంలోనే ఏనుగుల గుంపు ట్రాక్ వైపు రావడం విధుల్లో ఉన్న అటవీ శాఖ సిబ్బంది కంటపడింది. వారు వెంటనే స్పందించి సమాచారాన్ని లోకో పైలట్‌తో పాటు లుమ్డింగ్ రైల్వే కంట్రోల్ రూమ్‌కు చేరవేశారు. సమన్వయంతో రైలును వెంటనే నిలిపివేయడంతో ఏనుగులన్నీ ఎటువంటి ఆటంకం లేకుండా సురక్షితంగా పట్టాలు దాటాయి. అనంతరం రైలు తన ప్రయాణాన్ని యథావిధిగా కొనసాగించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను అస్సాం అటవీ శాఖ మంత్రి జయంత మల్ల బారువా సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ అధికారులను ప్రశంసించారు. అటవీ సిబ్బంది, రైల్వే యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించి వన్యప్రాణులను కాపాడారని ఆయన కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా వన్యప్రాణుల కారిడార్ల మీదుగా వెళ్లే రైల్వే మార్గాల్లో నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని, ఈ చర్యలు మానవ-వన్యప్రాణి సంఘర్షణలను, రైలు ప్రమాదాలను అరికట్టడంలో కీలకంగా మారాయని పేర్కొన్నారు.

## ఆంధ్రా పాప్‌కార్న్-అరకు కాఫీ

**ఏలూరు:** మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పంటలను ప్రాసెస్ చేసి విలువ జోడిస్తే అవి రైతులకు లాభదాయకంగా మారతాయని, ఆ దిశగా అన్నదాతలను సిద్ధం చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో పండే మిరప, పసుపు, మొక్కజొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు ప్రాసెస్ చేసి మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్‌కు తరలిద్దామని పిలుపునిచ్చారు. ముసునూరు మండలం కాట్రేనిపాడులోని గౌర్మెట్ పాప్‌కార్నికా పరిశ్రమలో సోమవారం నూతన వంగడం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. అన్ని రైల్వే స్టేషన్లల్లో 'ఆంధ్రా పాప్‌కార్న్-అరకు కాఫీ' కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతామని సీఎం స్పష్టం చేశారు. 'కొండపల్లి కొయ్య బొమ్మల్లాంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌కు వెళ్లాలి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. దాన్ని పెంచితే అధిక సంపదను ఆర్జించే అవకాశం ఉంటుంది. ఈ రంగంపై యువత దృష్టి పెట్టాలి. ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటలు కూడా మారాలి. రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. రూ.లక్ష కోట్లతో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో సీమను అభివృద్ధి చేస్తున్నాం.

ఈ ప్రాజెక్టుకు సెప్టెంబరులో శ్రీకారం చుడతాం. రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తాం. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉన్నా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడాం. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. దేశం అంతా నదుల అనుసంధానం జరగాలన్నదే ఎన్డీయే ప్రభుత్వ ఆలోచన. దీనిపై ఇటీవల దక్షిణాది రాష్ట్రాల సీఎంల సమావేశం జరిగింది. గోదావరి కృష్ణా, తుంగభద్ర, పెన్నా-కావేరి నదుల అనుసంధానంపై చర్చించాం. వాటితో 4 రాష్ట్రాల్లో నీటి సమస్య పరిష్కారమవుతుంది. అప్పుడు దేశానికి తిరుగుండదు. నీటి భద్రత ఏర్పడుతుంది. ఇది సాధిస్తే దేశ అభివృద్ధి అన్‌స్టాపబుల్' అని సీఎం స్పష్టం చేశారు.

'దేశీయంగా జన్యు మార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి మన నేలపై గౌర్మెట్ ఇండస్ట్రీ ఉత్పత్తి చేస్తోంది. ఆ సంస్థను అభినందిస్తున్నా. దేశంలో 3400 సినిమా థియేటర్లతో ఒప్పందం చేసుకుని పాప్‌కార్న్ సరఫరా చేస్తోంది. దేశవ్యాప్తంగా పాప్‌కార్న్ ఉత్పత్తిలో ఇది 70 శాతం వాటా కలిగి ఉంది. ఇప్పటి వరకు



మనం బ్రెజిల్ తదితర దేశాల నుంచి పాప్‌కార్న్ కొనుగోలు చేశాం. ఇక నుంచి ఈ సంపద ఇక్కడే ఉంటుంది. అది మన రైతులకే దక్కుతుంది. గ్లోబల్ మార్కెట్‌కు మన పాప్‌కార్న్ ఎగుమతి కావాలి' అని సీఎం ఆకాంక్షించారు.

## విశాఖలో డేటా సెంటర్లపై విమర్శలు.. మంత్రి లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్



**అమరావతి:** విశాఖ కేంద్రంగా ఏఐ హబ్ దేశానికే తలమానికంగా రూపుదిద్దుకుంటుందని.. డేటా కేంద్రాల అనుమతుల విషయంలో ఎటువంటి పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడడం లేదని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. డేటా సెంటర్లపై అసెంబ్లీలో జనసేన ఎమ్మెల్యే నాగమాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటుతో నగరానికి నీటి కొరత వస్తుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. డేటా సెంటర్లపై అపోహలు వ్యాప్తి చేయడం సరికాదని, దీన్ని కలిసికట్టుగా అందరూ ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. డేటా సెంటర్లు ఏఐ ఆధారిత డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, దేశ డేటా సార్వభౌమత్వానికి కీలకమని స్పష్టం చేశారు. 6.5 గిగావాట్ల సామర్థ్యం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రస్తుత సాంకేతికత ప్రకారం ఏడాదికి సుమారు 3 టీఎంసీల నీరు అవసరమవుతుందని, కొత్త కూలింగ్ టెక్నాలజీలతో నీటి వినియోగం మరింత తగ్గుతుందని తెలిపారు. డేటా సెంటర్లకు పోలవరం నీటిలో పారిశ్రామిక కేటాయింపుల నుంచే నీరు అందిస్తామని, విశాఖ నగర ప్రజల నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. నగర అవసరాలకు పోలవరం నీటిని గ్రావిటీ ద్వారా 18 నెలల్లో అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, డేటా సెంటర్ల కోసం ప్రత్యేక పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఒక గిగావాట్ థర్మల్ పవర్ ప్లాంట్‌తో పోలిస్తే డేటా సెంటర్ నీటి వినియోగం దాదాపు పదో వంతేనని మంత్రి వివరించారు. సీఎం చంద్రబాబు నిర్దేశించిన 6.5 గిగావాట్ల డేటా సెంటర్ కేటాయింపుల లక్ష్యం ఇప్పటికే పూర్తైందని, పర్యావరణ బాధ్యతతో పనిచేసే సంస్థలకు ప్రాధాన్యం ఇస్తామని లోకేశ్ తెలిపారు.

## పాలిటిక్స్‌లోకి విజయసాయి రెడ్డి రీ ఎంట్రీ..!



**అమరావతి** : రాజ్యసభ ఎంపీ పదవికి రాజీనామా చేసి, రాజకీయాలకు గుడ్ బై చెప్పిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తన రాజకీయ పునరాగమనంపై స్పష్టతనిచ్చారు. బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడుతానని ఆయన తెలిపారు. ప్రజల గొంతుకను వినిపించేందుకు కొత్త పార్టీని పెట్టబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంత తగ్గి వర్షాలు కురువాలని భగవంతుడిని ప్రార్థించినట్లు విజయసారథి చెప్పారు. ఇన్నాళ్లు ఊరిస్తూ వస్తున్ ఆయన పొలిటిక్ ఎంట్రీకి క్లారిటీ రావడంతో మాజీ ఎంపీ పొలిటికల్ రీ ఎంట్రీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, విజయసాయి రెడ్డి కొత్త పార్టీ పేరు 'భారత్ జన వికాస్' అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కొన్ని మీడియా సంస్థలు 'భారత్ జన వికాస్' పేరు పెట్టినట్లుగా చెబుతున్నాయి. ఆయన మాత్రం ఇప్పటి వరకు కొత్త పార్టీ పేరుపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## నిరోద్యోగులకు కూటమి ప్రభుత్వం టోకరా

**అమరావతి:** ఏపీలో నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీరని మోసం చేసింది. నిరుద్యోగ భృతి అమలు చేయడం లేదని శాసనమండలిలో ఖరాఖండీగా తేల్చిచెప్పింది. మండలి సమావేశాల్లో నిరుద్యోగ భృతిపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించగా భృతి ఇచ్చేది లేదని తెలిపింది. అంతేకాకుండా అది ఎప్పటి నుంచి అమలు చేస్తారో అన్న విషయాలను సైతం కూటమిలో ప్రకటించలేదు. కాగా శాసనమండలిలో మూడో రోజు సమావేశాలు వాడివేడీగా జరిగాయి. డీఎస్సీ అక్రమాలపై చర్చకు పట్టుబడుతూ వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు. డిప్యూటీ ఛైర్మన్ ఎన్నిక సమయంలోనూ సభలో కూటమి సభ్యులు సభను వీడారు. దీంతో కూటమి ఎమ్మెల్సీలు వ్యవహరిస్తున్న తీరుపై వైఎస్సార్సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### డీఎస్సీ అక్రమాలపై చర్చకు వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీల పట్టు

**అమరావతి:** శాసనమండలి సమావేశాలు ప్రారంభమైన వెంటనే డీఎస్సీలో జరిగిన అక్రమాలపై చర్చించాలని వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీలు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలతారెడ్డి, రామచంద్రారెడ్డి ఈ తీర్మానాన్ని ఇచ్చారు. అయితే మండలి ఛైర్మన్ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించడంతో వైయస్ఆర్‌సీపీ సభ్యులు డీఎస్సీ అంశంపై చర్చకు పట్టుబట్టారు. ఇప్పటికే రెండు రోజులుగా డీఎస్సీ అంశంపై చర్చకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో మూడో రోజు కూడా వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు. డీఎస్సీ అక్రమాలపై చర్చ జరిగే వరకు తమ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేస్తూ పోడియం వద్ద నినాదాలు చేశారు. వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీల నినాదాలతో సభలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎమ్మెల్సీల ఆందోళన నేపథ్యంలో మండలి ఛైర్మన్ సభకు కొద్దిసేపు విరామం ప్రకటించారు. మరోవైపు వైయస్ఆర్‌సీపీ సభ్యులను సస్పెండ్ చేయాలని మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్ ఛైర్మన్‌ను కోరారు. సభలో చర్యలు తీసుకోవాలంటే నిబంధనల ప్రకారం ప్రక్రియను పాటించాలని ఛైర్మన్ స్పష్టం చేశారు. ఎలా చర్యలు తీసుకోవాలో తనకు తెలుసని చెబుతూ పదేపదే 'ఛైర్' అంటూ ఆదేశాలు ఇచ్చేలా మాట్లాడటం సరికాదని మంత్రుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను ఎలా నిర్వహించాలో తనకు చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర చర్చ జరిపించి వాస్తవాలను సభ ముందుకు తీసుకురావాలని వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీలు పట్టుబట్టారు. అభ్యర్థులకు సంబంధించిన సమస్యలు, నియామక ప్రక్రియపై ఉన్న సందేహాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరుతూ తమ ఆందోళనను కొనసాగించారు.

# ఓనంలో ఓ ఆనందం



తెలుగు సంవత్సరాది ఉగాదికి.. ఆమని వస్తుంది. మావి చిగురిస్తుంది. కోయిల పాడుతుంది. ప్రకృతి పరవశిస్తుంది. అదే మలయాళీల కొత్త సంవత్సరం ఓనమ్ వచ్చిందంటే.. వర్షాలతో కేరళం మురిసిపోతుంటుంది. నదులు ఉప్పొంగుతుంటాయి. సరస్సులు నిండుకుండలు అవుతాయి. కాలువలు పారుతుంటాయి. నదుల పాయల్లో.. కాలువల మలుపుల్లో.. సరస్సుల్లో.. ముచ్చటగా ముస్తాబైన పడవలు పరుగులు తీస్తుంటాయి. పోటాపోటీగా దూసుకెళ్తుంటాయి. తమదైన సంస్కృతిని చాటి చెబుతుంటాయి. ఓనం పండుగ వేళ.. కేరళంలో బోట్ రేసులు జోరుగా సాగుతుంటాయి.

రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో ఈ పడవ పందేలు సాగినా.. అలెప్పీలో జరిగే నెహ్రూ బోట్ ట్రోఫీ బోట్ రేస్ మరింత ప్రత్యేకం. ఎప్పుడెప్పుడు ఆగస్టులో వస్తుందా అని ఏడాదంతా ఎదురు చూస్తుంటారు అలెప్పీవాసులు. వాళ్లు మాత్రమే కాదు.. పడవ పందేలంటే ఆసక్తి ఉన్నవాళ్లంతా రేసు జరిగే రోజు గురించి నెలల ముందే వాకబు చేస్తారు. ముందస్తుగానే టికెట్లు గట్రా బుక్ చేసుకొని అలెప్పీ బాటపడతారు. పోటీ జరిగే పున్నామడ సరస్సు ఒడ్డుకు తండోపతండాలుగా చేరుకుంటారు. ఈలలు, కేరింతలతో పోటీలో పాల్గొన్నంత ఉత్సాహం ప్రదర్శిస్తారు. ఈసారి ఆగస్టు 22న జరగనున్న పోటీ రోజూ ఇదే సందడి అక్కడ నెలకొంటుంది.

భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 1952లో ఇక్కడికి వచ్చారు. పడవ పందేలు చూసి ముచ్చటపడ్డారు. రేసులో గెలిచిన పడవలోకి ఎక్కి మరీ.. నావికులను అభినందించారట! ఆయన గౌరవార్థం 1969లో ఈ బోట్ రేస్‌కు నెహ్రూ ట్రోఫీగా నామకరణం చేశారు నిర్వాహకులు. కేరళంలో జరిగే అతిపెద్ద పడవ పోటీలివి! ఇందులో పాల్గొనడాన్ని ఒక గౌరవంగా భావిస్తారు. జులై మాసం రావడంతోనే పలు గ్రామాల్లోని యువకులు పందేనికి సై అంటారు. కొత్తగా పడవలను తయారు చేస్తారు. ఆహార నియమాలు, కఠోర వ్యాయమాలు చేసి శారీరకంగా సన్నద్ధం అవుతారు. బ్యాక్‌వాటర్స్ కాలువల్లో తమ వేగాన్ని పరీక్షించుకుంటారు.

అసలు పోటీల్లో తమ వారి విన్యాసాలను చూసేందుకు ఆయా గ్రామాల ప్రజలంతా చలో అలెప్పీ అంటారు. తమవారు విజయం దిశగా సాగేలా ప్రోత్సహిస్తారు. ఇలా పదుల సంఖ్యలో పడవలు సరస్సులో పోటీకి దిగుతాయి. ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు తరలివస్తారు. సరస్సులో పెద్ద పెద్ద బోట్లపై విహరిస్తూ.. పోటీలను దగ్గరగా తిలకిస్తారు. వాద్యాల హోరుకు తగ్గట్టుగా పడవను నడుపుతున్న నావికుల విన్యాసాలను చూసి ఆశ్చర్యపోతారు. ఒకట్రెండు రోజులు అలెప్పీలో ఉండి చుట్టుపక్కల ఉన్న పర్యాటక కేంద్రాలను వీక్షించి తిరుగు ప్రయాణమవుతారు. ఎందుకు ఆలస్యం మీరూ చలో అలెప్పీ అనేయండి!!

## 29లోగా డిమాండ్లు నెరవేర్చకుంటే దేశవ్యాప్త ఆందోళనలు

**న్యూఢిల్లీ:** భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ, తమ డిమాండ్లపై కేంద్రం తిరిగి చర్చలు ప్రారంభించాలని కోరుతూ, అలాగే ఢిల్లీ మార్చ్‌కు అనుమతివ్వాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేపట్టిన నిరసనలు మంగళవారం నాటికి మూడో రోజుకు చేరాయి. ఆగస్టు 29లోగా తమ డిమాండ్లను పరిష్కరించకుంటే దేశవ్యాప్త నిరసనలు చేపట్టి, మహా పంచాయత్‌తో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రైతు సంఘాల నేతలు హెచ్చరించారు. మంగళవారం రైతులు ఖనౌరీ దాతా సింగ్‌వాలా సరిహద్దు వద్ద టెంట్లు వేసుకుని నిరసనలు కొనసాగించారు. కాలినడకన ఢిల్లీకి వెళ్లేందుకు తమకు అనుమతినివ్వాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా కార్యకర్తల కీలక సమావేశం జరగనుంది. దీనిలో రైతు నిరసనల తదుపరి వ్యూహాన్ని ఖరారు చేయనున్నట్లు సమాచారం.

అమెరికా వ్యవసాయ దిగుమతుల గురించిన భయాలు మొదలుకొని, విద్యుత్తు సరఫరా లైన్లు, నష్టపరిహారం వరకూ దేశవ్యాప్తంగా రైతులు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్ నేత, గుజరాత్‌కు చెందిన వైద్యుడు, రైతు అయిన డాక్టర్ దినేష్ భాయ్ పర్మార్ దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న ఇక్కట్లను 'ది వైర్' వెబ్‌సైట్‌కు తెలిపారు. ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా వేలాదిమంది రైతులు దేశవ్యాప్తంగా రెండు నెలలుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారని, మనం దీనిపై మౌనంగా ఉండలేమని, ఈ విధంగా భారతదేశాన్ని ట్రంప్‌కు అమ్ముకోకూడదన్నారు.

అమెరికాతో వాణిజ్య ఒప్పందం కారణంగా చౌకైన అమెరికన్ ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి ప్రవేశించి, దేశీయ వ్యవసాయాన్ని దెబ్బతీస్తాయని భయపడుతూ పంజాబ్, హర్యానాతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారన్నారు. ఈ ఒప్పందం కేవలం తమపైనే కాకుండా తమపై




ఆధారపడిన శ్రామికులు, దుకాణదారులు, చివరకు వినియోగదారులతో సహా మొత్తం వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని రైతులు అంటున్నారు. మరోవైపు గుజరాత్‌లోని మోర్బీలో వ్యవసాయ భూముల్లో రాష్ట ప్రభుత్వం హై వోల్టేజీ విద్యుత్ సరఫరా లైన్లు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడానికి వ్యతిరేకంగా రైతుల నిరసనలు రెండు నెలలుగా కొనసాగుతున్నాయి.

వీటివల్ల తమ వ్యవసాయ భూములను కోల్పోతున్నామని, అలాగే తక్కువ పరిహారం అందుతున్నదని రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు మధ్యప్రదేశ్ రైతులు తమ పెసర పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరుతూ భోపాల్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎరువుల కొరతపై కూడా వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యవసాయ, ఆర్థిక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర ట్రేడ్ యూనియన్లు కూడా దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. తమిళనాడు, త్రిపుర, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో పలు కార్మిక సంఘాలు ఈ నిరసనలకు నాయకత్వం వహించాయి. రైతుల ఆదాయాన్ని, భూమిని ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే ముందు ప్రభుత్వం తమ మొర వినాలని రైతులు కోరుతున్నారు.

## కూటమి కుట్రలను ఎదుర్కొంటూ యుద్ధం చేయాలి



**తాడేపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు సిద్ధం కావాలని.. గెలుపే లక్ష్యంగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన.. రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇంఛార్జి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఏ ఒక్క వర్గమూ కూడా సంతోషంగా లేదన్నారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకత స్థానిక ఎన్నికల్లో కనబడకుండా చేసేందుకు పోలీసులను ప్రయోగిస్తారు. అన్నీ ఎదుర్కొని యుద్ధం చేయాలి. మనకు అత్యంత ప్రజాదరణ ఉంది. అందుకే తప్పకుండా గెలుస్తాం'' అని వైఎస్ జగన్ తేల్చి చెప్పారు.

''రాష్ట్రంలో దారుణంగా దిగజారిన శాంతి భద్రతలు. ఇసుక, మట్టి, మద్యం మాఫియాలు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన పోలీసులు. ఆ స్థాయికి దిగజారిన వ్యవస్థలు. ఆ ఘటన నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకు కుట్రలు చేస్తున్నారు. రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంకను దారుణంగా చంపారు. కారుతో పదే పదే ఢీకొట్టి ప్రాణం తీశారు. అయినా కేసు బయటకు రాకుండా తొక్కి పెట్టే ప్రయత్నం చేశారు. అంత దారుణంగా పోలీసులు, అధికార పార్టీ వారు కుమ్మక్కై పని చేస్తున్నారు'' అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''రాష్ట్ర ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచిన వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలేదు. విద్యార్థులు, రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, ఉద్యోగులు, వ్యాపారులు.. ఇలా ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు. అందుకే వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం మీద రెండేళ్లలోనే తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అదే సమయంలో మన వైఎస్సార్‌సీపీపై రోజురోజుకీ ప్రజాదరణ పెరుగుతోంది.

..అందుకే నాటి గత మన ఐదేళ్ల పరిపాలనను, ఇప్పుడు వెన్నుపోటు పార్టీ కూటమి పాలనతో పోల్చి చూస్తున్నారు. దీనిపై ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది. మరో ఏడాదిలో నా పాదయాత్ర మొదలవుతుంది. ఆ తర్వాత ఏడాది ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనదే విజయం. నిత్యం ప్రజలతో మమేకమై పని చేయండి'' అంటూ వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

## వైఎస్సార్‌సీపీలో చేరికలు.. కక్షతో మార్గాని భరత్ అరెస్ట్

**తూర్పుగోదావరి:** రాజమండ్రిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నేత మార్గాని భరత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజమండ్రి 36వ డివిజన్‌లో టీడీపీ నుంచి పలువురు కార్యకర్తలను వైఎస్సార్‌సీపీలో చేర్చుకునే కార్యక్రమానికి భరత్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వస్తున్న భరత్, మాజీ ఎంపీ సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. అనంతరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భరత్ అరెస్ట్‌తో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో రాజమండ్రి 36వ డివిజన్‌లో ఉద్రిక్తత కొనసాగింది.

## ప్రతి ఎమ్మెల్యేకు ఓ కారు, పెట్రోల్ అలవెన్స్ ప్రకటించిన సీఎం విజయ్



**చెన్నై:** తమిళనాడు సీఎం విజయ్ ఆ రాష్ట్ర ఎమ్మెల్యేలకు భారీ బొనాంజా ప్రకటించారు. ప్రతి ఎమ్మెల్యేకు ఓ కారు, పెట్రోల్ అలెవన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం చెప్పారు. తమిళనాడులో మొత్తం 234 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇప్పుడు వారందరికీ ప్రభుత్వం తరపున ఓ కారు అందనున్నది. దాని పెట్రోల్, మెయింటెనెన్స్ ఖర్చులు ప్రభుత్వమే ఇవ్వనున్నది. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలు నిత్యం ప్రయాణం చేయాల్సి ఉంటుందని, ప్రభుత్వ వాహనం వల్ల పారదర్శక, అవినీతిలేని ప్రభుత్వాన్ని నడపవచ్చు అని అన్నారు.

పెద్దగా బ్యాక్‌గ్రౌండ్ లేనివారు ఈసారి చాలా మంది ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, ప్రజా ప్రతినిధిగా తమ విధులను డిశ్చార్జ్ చేసేందుకు ఓ కారు అవసరమని అసెంబ్లీలో విజయ్ పేర్కొన్నారు. తమకు లాజిస్టిక్స్ సపోర్టు లేదని, కార్లు ఇవ్వాలని వీసీకే ఎమ్మెల్యే జ్యోతిమణి ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే కారు డ్రైవర్, ఇంధనం, మెయింటెనెన్స్ ఖర్చుల కోసం 75 వేలు ఇవ్వనున్నారు. ఎమ్మెల్యేలకు సెక్రటరీలను కూడా ఇవ్వనున్నారు. వారి కోసం అదనంగా 25వేలు ఖర్చు చేయనున్నారు. సీఎం ప్రకటనను ఎమ్మెల్యేలు స్వాగతించారు.

## ఎన్టీఏలో 600 మంది నిపుణుల తొలగింపు




**న్యూఢిల్లీ:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో ప్రక్షాళన చేపట్టారు. సుమారు 600 మంది సబ్జెక్ట్ నిపుణులను తొలగించారు. వీరి స్థానంలో బోర్డులోకి కొత్త నిపుణులను నియమిస్తున్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదేశాల ప్రకారం ఈ మార్పులు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్టీఏ రివ్యూ మీటింగ్‌లో మంత్రి జోషి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు కావాల్సిన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రశ్నాపత్రాల తయారీలో నాలుగు అంచెల విధానాన్ని అమలు చేయనున్నట్లు ఎన్టీఏ డైరెక్టర్ మంత్రి జోషికి వివరించారు. భద్రతను పెంచి, లోపాలను తగ్గించనున్నట్లు తెలిపారు.

రాబోయే మూడు వారాల్లోగా సుమారు 25 మంది అధికారులను ఎన్టీఏలోకి తీసుకోనున్నట్లు డైరెక్టర్ జనరల్ చెప్పారు. ఎన్టీఏ ఆఫీసులను కొత్త ప్రదేశాలకు మార్చనున్నారు. సీఐఎస్ఎఫ్ దళాలను మోహరించే రీతిలో ఆఫీసులను ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల జరిగిన నీట్ యూజీ పేపర్ పరీక్ష లీక్, రద్దు ఘటనల నేపథ్యంలో విద్యాశాఖ కార్యదర్శి, ఎన్టీఏ డైరెక్టర్‌తో మంత్రి జోషి సమావేశం అయ్యారు. ప్రస్తుతం ఎన్టీఏ నుంచి 50 మంది సిబ్బందిని తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. కొత్తగా 10 ప్రొఫెషనల్ లీడర్‌షిప్ పొజిషన్స్ ప్రకటించారు. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూర్టీ ఆఫీసర్, జనరల్ మేనేజర్ టెస్ట్ సెక్యూర్టీ, ఆర్ అండ్ డీ జనరల్ మేనర్ పోస్టులకు రిక్రూట్మెంట్ చేస్తున్నారు. సైబర్ సెక్యూర్టీ, సైకోమెట్రిక్స్, క్వశ్చన్ పేపర్ డిజైన్ అంశాలపై ఫోకస్ పెట్టినట్లు మంత్రికి చెప్పారు. కాన్ఫిడెన్షియల్ ఆపరేషన్స్‌కు సంబంధించిన వ్యవస్థను సమూలంగా మార్చాలని మంత్రి ఆదేశించారు.

# పరోక్షానికి గుడ్‌బై.. ప్రత్యక్షానికి సై!



» మున్సిపల్ పోరులో కూటమికి కొత్త టెన్షన్!
» చైర్మన్లు, మేయర్ల ప్రత్యక్ష ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్..
» టీడీపీలో అసంతృప్తి, వైసీపీలో ఆశలు

**అమరావతి:** మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్లను ప్రజలు నేరుగా ఎన్నుకునే పాత విధానాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వ నిర్ణయం కూటమి శిబిరంలో కొత్త చర్చకు తెరలేపింది. ప్రత్యక్ష ఎన్నికల విధానం వైసీపీకి రాజకీయంగా మేలు చేస్తుందన్న ఆందోళన టీడీపీ ప్రజాప్రతినిధుల్లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. మరోవైపు ఇదే నిర్ణయంపై వైసీపీలో మాత్రం ఉత్సాహం కనిపిస్తోంది.

## బాబు నిర్ణయంపై టీడీపీలో గుబులు?

మరో రెండు నెలల్లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలు నిర్వహించడంపై పెద్దగా అభ్యంతరం లేని మంత్రులు, ఎమ్మెల్యేలు.. చైర్మన్లు, మేయర్లను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకునే విధానంపైనే ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పరోక్ష ఎన్నికల విధానం కొనసాగితే కౌన్సిలర్లు, కార్పొరేటర్ల సంఖ్యా బలంతో పీఠాలను సులభంగా కైవసం చేసుకునే అవకాశం ఉంటుందని కూటమి ప్రజా ప్రతినిధులు భావిస్తున్నారు. కానీ ప్రత్యక్ష ఎన్నికల్లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుందని, అభ్యర్థి వ్యక్తిగత ప్రభావం, స్థానిక అసంతృప్తి, ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం వంటి అంశాలు నేరుగా ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.

## 'గ్రౌండ్ రియాలిటీ'పై భిన్నాభిప్రాయాలు

ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో అనుకూలత ఎక్కువగా ఉందన్న సర్వే నివేదికలపై ఆధారపడటం కంటే.. స్థానికంగా కనిపిస్తున్న పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కొందరు టీడీపీ ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి స్థాయిలో సానుకూల వాతావరణం ఉందన్న అంచనాలు మున్సిపల్ ఎన్నికల్లో తప్పు కావచ్చని వారు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో స్థానిక సమస్యలు, అభ్యర్థుల ఎంపిక, వ్యక్తిగత వ్యతిరేకతలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

## పరోక్ష ఎన్నికలైతే 'పీఠం' మనదే!

పరోక్ష ఎన్నికల విధానం కొనసాగితే కౌన్సిలర్లు, కార్పొరేటర్లను గెలిపించుకోవడం ద్వారా చైర్మన్, మేయర్ పీఠాలను దక్కించుకునే వ్యూహాన్ని అమలు చేయవచ్చని కూటమి నేతలు భావిస్తున్నారు. ఏకగ్రీవాలు, స్థానిక రాజకీయ సమీకరణాలు, ఎన్నికల అనంతర మద్దతు వంటి మార్గాల ద్వారా బలాబలాలను తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. అదే ప్రత్యక్ష ఎన్నికల్లో అయితే.. చైర్మన్, మేయర్ అభ్యర్థి ఓటమి మొత్తం పార్టీకి రాజకీయంగా ఇబ్బందికర సంకేతంగా మారు తుందని భయపడుతున్నారు. ఒకవేళ తమపై ఉన్న అసంతృప్తిని ఓటర్లు ప్రత్యక్షంగా వ్యక్తం చేస్తే.. దాని ప్రభావం రానున్న రాజకీయ పరిణామాలపై కూడా పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

## లోకేశ్ ద్వారా చెప్పినా పట్టించుకోలేదా?

ఈ అంశంపై కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మంత్రి నారా లోకేశ్ ద్వారా కూడా సీఎం చంద్రబాబుకు తమ అభ్యంతరాలను తెలియజేసినట్లు వారు చెబుతున్నట్లు సమాచారం. అయినప్పటికీ ప్రత్యక్ష ఎన్నికల విధానానికే ప్రభుత్వం మొగ్గు చూపడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రత్యక్ష ఎన్నికల్లో వైసీపీ కొన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గెలుచుకున్నా.. అది కేవలం స్థానిక ఎన్నికల ఫలితంగా కాకుండా కూటమి ప్రభుత్వంపై ప్రజాభిప్రాయానికి సంకేతంగా ప్రచారం జరిగే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.

## వైసీపీలో మాత్రం జోష్!

ఇదే సమయంలో ప్రత్యక్ష ఎన్నికల విధానంపై వైసీపీ శిబిరంలో మాత్రం ఉత్సాహం కనిపిస్తోంది. పరోక్ష విధానంతో పోలిస్తే ప్రత్యక్ష ఎన్నికలు తమకు మరింత అనుకూలంగా ఉంటాయని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వంపై స్థానిక అసంతృప్తి, పట్టణ సమస్యలు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలను తమకు అనుకూలంగా మలుచుకుని ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రయోజనం పొందవచ్చని వైసీపీ లెక్కలు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కేవలం ఎన్నికల విధానంలో మార్పుగా మిగిలిపోతుందా? లేక కూటమి రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే తొలి సంకేతంగా మారుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని వైసీపీ ఎంత మేరకు తనకు అనుకూలంగా మలుచుకుంటుందో.. కూటమి తన బలాన్ని ఎలా నిరూపించుకుంటుందో తేలాలంటే మున్సిపల్ ఫలితాల వరకు వేచిచూడాలి.

## ఆవకాయదే అగ్రస్థానం!



వేసవి అంటే ఊరగాయల సీజన్ కూడా! మామిడి కాయలతో తయారు చేసే ఆవకాయ, నిమ్మకాయ ఊరగాయ, మిర్చి ఊరగాయ- ఇలా ఎన్ని రకాలు ఉన్నా, ఊరగాయల మార్కెట్‌లో అగ్రస్థానం మామిడి ఆవకాయకే దక్కుతుంది. మన దేశంలో తయారయ్యే ఊరగాయల్లో దాదాపు మూడోవంతు వాటా ఆవకాయదే!

దేశవ్యాప్తంగా ఉత్పత్తవుతున్న రకరకాల ఊరగాయల ఉత్పాదనలో దాదాపు 70% కుటీర పరిశ్రమల్లా ఇళ్ల వద్ద తయారు చేసిన ఊరగాయలే ఉంటాయి. ఊరగాయల మార్కెట్‌లో బ్రాండెడ్ ఉత్పత్తుల వాటా సుమారు 30% మాత్రమే! ఊరగాయల ఉత్పాదనలో రాష్ట్రాల వారీగా గణాంకాలను పరిశీలిస్తే, తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నాయి. రాష్ట్రాల వారీగా ఊరగాయల ఉత్పాదనలో మొదటి పది స్థానాల్లో ఉన్న రాష్ట్రాల వివరాలు ఇవీ:

చేపలు, రొయ్యలు, చికెన్, మటన్ ఊరగాయల ఉత్పత్తి కేరళలలోను, ఈశాన్య రాష్ట్రాల్లోను అత్యధికంగా ఉంటోంది. ఈశాన్య రాష్ట్రాల్లోను, తూర్పు రాష్ట్రాల్లోను వెదురు మొలకలు, తామరతూళ్ల ఊరగాయలు, కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో యాపిల్ ఊరగాయ వంటివి ప్రత్యేకంగా తయారు చేస్తారు.

## జయ హనుమంత! అమిత బలవంత!



**చాలా గొప్ప వైవిధ్యభరిత పాత్రలనే రత్నాలతో కూర్చబడిన హారం శ్రీమద్రామాయణం. అన్నిటి మధ్యనా తళుకులీనే మేటి మణిపూస వంటి పాత్రగా హనుమంతుడు మనకు దర్శ నమిస్తాడు. మహా జ్ఞాన సంపన్నుడు, అద్భుత బలశాలి, వినయశీలి, మహా భక్తుడు, ధీరాగ్రేసరుడు, కార్యసాధకుడుగా మనకు గోచరమవుతాడు.**

శివాంశతో, వాయుదేవుని అనుగ్ర హంతో కేసరి, అంజనాదేవి దంపతులకు జన్మించిన ఆంజనేయుడు బాల్యం నుండే తన అద్భుత శక్తి సామర్థ్యాలను చూపించాడు. సముద్ర లంఘనం, రాక్షస సంహారం, సంజీవనిని తేవడం వంటి ఘనకార్యాలు మారుతివంటి బలశాలికి తప్ప ఇతరులకు సాధ్యమయే విషయాలు కావు. బాల్యంనుండే తన దేహబలాన్ని దుందుడుకు పనులకు ఉపయోగిస్తున్న బాలాంజనేయునికి ఆయన హితైషులు ఒక శాపం వంటి వరాన్ని ఇచ్చారు. అదేమంటే తన శక్తి తనకు తెలియక పోవడం. ఇతరులెవరైనా తెలిపితే తప్ప మారు తికి తన శక్తి సామర్థ్యాలు తనకు తెలియకూడదని శ్రేయోభిలాషుల ఆంతర్యం.

**విద్యావినయసంపన్నుడు - కేసరీ నందనుడు** : పట్టుదల, బుద్ధి కుశలత, సూక్ష్మగ్రాహిత్వము, విద్యా పారీణతలకు ఆంజనేయుడు ప్రతీక. ఆయనను సేవిస్తే విద్యలలో కౌశల్యం, సూక్ష్మ బుద్ధి తప్పక లభిస్తాయని పరాశర సంహిత చెబుతుంది. అంతటి విద్య, ఘనమైన దేహబలమున్నా, మూర్తీభవించిన వినయస్వరూపుడు హనుమ. తన ప్రభువైన సుగ్రీవుని పట్ల, తనకు దైవమైన శ్రీరాముని పట్ల ఆయ న ప్రదర్శించిన వినయం అద్వితీయ మైనది. తాను వారికి సేవకునిగా, బంటుగా ఎప్పుడూ భావించేవాడు ఆయన. ఇది లోకులందరకూ స్ఫూర్తి దాయకం. అతని భక్తికి నిదర్శనమా అన్నట్లు మారుతి లేని రామాలయం ఎక్కడా కనపడదు.

**కార్యదీక్షా తత్పరుడు** : ఒక కార్యాన్ని తలపెట్టిన తర్వాత ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కు తగ్గే ప్రసక్తే లేకుండా, ఆ కార్యం నెరవేర్చే దాకా విశ్రమించని లక్షణం హనుమది. సామాన్యులకు సరే సరి... అంగద, జాంబవంతాది వీరులకు కూడా దాటడానికి సాధ్యం కాని సముద్రాన్ని దాటి, లంక ను చేరి, సీతమ్మ జాడ కనుగొని, తమ శక్తిని శత్రువులకు తెలియజేసి, తిరిగి ఆ విషయాన్ని శ్రీరామునికి నివేదించే వరకూ హనుమ విశ్రమించలేదు. ఆతిథ్యాన్ని అందించ వచ్చిన మైనాకునితో మరియు సముద్రునితో ఆ విషయమే సవినయంగా తెలిపి ముందుకు సాగిన కార్య నిబద్ధుడు ఆంజనేయుడు. ఎన్నో సుగుణాలు, ఆదర్శాలు మూర్తీభవించి ఉన్న హనుమను తమల పాకులు, వడల మాలలు, సింధూరాలతో పూజించిన భక్తులకు బుద్ధి, దేహబలం, కీర్తి, ధైర్యం, నిర్భయ త్వం, ఆరోగ్యం, పాపనివృత్తి, వాక్పాటవం కలుగుతాయని పెద్దల మాట. అంతేకాదు. ఆంజనేయుని పూజించే వారి కి భోగ, మోక్షాలు రెండూ సులభంగా లభిస్తాయని పరాశర సంహిత చెబు తున్నది. మన దేశంలోని దాదాపు ప్రతి చిన్న పల్లెలోనూ రామాలయాలు, ఆంజనే యుని ఆలయాలూ ఉన్నాయి. ముఖ్యంగా అర్ధగిరి, కొండగట్టు, గండి, కసాపురం, శింగరకొండ వంటి సుప్రసిద్ధ హనుమత్ క్షేత్రాలన్నింటిలోనూ హనుమజ్జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.




## పానీయాలతో జాగ్రత్త

**మండే ఎండల వల్ల శరీరంలో నీటిశాతం తగ్గడంతో తీవ్రమైన వడదెబ్బకు గురవుతుంటారు. అందుకే ఈ సమయంలో హైడ్రేషన్ విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదు. అయితే దాహం వేసినప్పుడు దొరికిన పానీయం తాగడం కంటే, ఏది మన శరీరానికి మేలు చేస్తుందో తెలుసుకొని తాగడం చాలా ముఖ్యం. హైడ్రేషన్ అంటే కేవలం నీరు తాగడం మాత్రమే కాదు. శరీర అవసరాలకు తగ్గట్టుగా ఆరోగ్యకరమైన పానీయాలను ఎంచుకోవడం. కొన్ని పానీయాలు మనల్ని చల్లబరుస్తాయని మనం అనుకుంటాం. కానీ, అవి శరీరంలో చకెర స్థాయిలను పెంచి, మనల్ని మరింత నీరసంగా మారుస్తాయి.**

**ప్యాకేజ్డ్ ఫ్రూట్ జ్యూస్:** వీటిలో ఫైబర్ తకువగా ఉండి, చకెరలు ఎకువగా ఉంటాయి. ఇవి రక్తంలో చకెర స్థాయుల్ని ఒకసారిగా పెంచి, ఆపై శక్తిని వేగంగా తగ్గించేస్తాయి.

**ఐస్డ్ టీ:** ఇందులో ఉండే అధిక చకెర.. కెఫిన్ మూత్రవిసర్జనను పెంచి, శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి.

**ప్రీ-ప్యాకేజ్డ్ ప్రొటీన్ షేక్స్:** వీటిని జీర్ణం చేసుకోవడం శరీరానికి కష్టమవుతుంది. ఆహారానికి సంబంధించిన థర్మిక్ ప్రభావం వల్ల ఇవి శరీరంలో వేడిని సృష్టిస్తాయి. దీనివల్ల కడుపు ఉబ్బరంగా అనిపిస్తుంది.

**శీతల పానీయాలు:** ఫ్లేవర్డ్ సోడాల్లో ఉండే విపరీతమైన చకెరలు శరీరానికి మేలు చేయవు. ఈ ప్రభావంతో జీవక్రియలు నెమ్మదిగా సాగుతాయి. ప్రత్యామ్నాయాలు

**కొబ్బరి నీరు:** సహజసిద్ధమైన ఎలక్ట్రోలైట్లతో నిండిన కొబ్బరి నీరు శరీరానికి కావాల్సిన తేమను అందిస్తుంది. ఇందులో అదనపు చకెర ఉండదు కాబట్టి ఇది సురక్షితం.

**కోకుమ్ రసం:** ఇది జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. భోజనం తర్వాత దీనిని తీసుకోవడం వల్ల ఉత్తమ ఫలితాలు ఉంటాయి.

**మూలికా నీరు:** సాదా నీరు తాగడం బోర్ కొడితే, పుదీనా ఆకులతో పుచ్చకాయ ముకలు, నారింజ, నిమ్మకాయ్‌స్లైసులు లేదా సోంపు, తులసి కలిపిన నీటిని తాగవచ్చు. ఇవి శరీరానికి అవసరమైన చల్లదనంతో పాటు ఎలక్ట్రోలైట్లను అందిస్తాయి.

## వరుణుడు కోసం అగ్నిబాణాలు

వానలు సమృద్ధిగా కురవాలి; పంటలు పుష్కలంగా పండాలి. ఇంటికి సిరిసంపదలు తేవాలి- ప్రతి దేశంలోనూ రైతులందరి ఆశ ఇది. ఇదే ఆకాంక్షతో థాయ్‌లాండ్, లావోస్ ప్రజలు ప్రతి ఏటా 'బున్ బాంగ్ ఫై' అనే రాకెట్ ఫెస్టివల్‌ను అత్యంత ఉత్సాహభరితంగా, అంగరంగ వైభవోపేతంగా జరుపుకొంటారు. ప్రకృతితో ముడిపడి ఉన్న ఈ అద్భుత వేడుక యసోథోన్ ప్రావిన్స్‌లో మే 8న ప్రారంభమై మే 10తో ముగుస్తుంది.

తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం వెనుక ఒక ఆసక్తికరమైన పురాణ గాథ ఉంది. లావోస్ వానదేవుడైన 'పయా థేన్' ఒక నాగ సర్పం కారణంగా ఆగ్రహించడంతో వర్షాలు కురవక కరవు వాటిల్లింది. దీంతో ప్రజలు ఆయనను ప్రసన్నం చేసుకోవడానికి వెదురుతో తయారు చేసిన భారీ రాకెట్లను ఆకాశంలోకి ఎగురవేశారట! ఈ పురాణం ఆధారంగా వానదేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి వెదురు రాకెట్లను ఎగురవేసే సంప్రదాయం మొదలైంది. వీరు ఎగురవేసే రాకెట్లు నేరుగా స్వర్గానికి చేరుకుని, ప్రజల అవసరాలను వానదేవుడికి విన్నవిస్తాయని, ఫలితంగా సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఇక్కడి ప్రజల ప్రగాఢ విశ్వాసం.

థాయ్‌లాండ్ ఈశాన్య ప్రాంతంలోని మెజారిటీ ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తారు. వరి పంటను ఎక్కువగా సాగు చేస్తారు. కాబట్టి వారికి వర్షాలు చాలా కీలకం. రుతుపవనాలు సకాలంలో రావడం వారికి చాలా ముఖ్యం. ఈ ప్రకృతి పండుగను థాయ్‌లాండ్‌లోని ఈశాన్య ప్రాంతాలైన యసోథోన్, రోయి ఎట్, కలసిన్, ఉడాన్ థాని, నోంగ్ ఖై, మహా సారఖామ్, సిసాకెట్, నోంగ్ బువా లాంపు, లోయి, అమ్నాత్ చారోయెన్ ప్రావిన్స్‌లతో పాటు ఉత్తర ప్రాంతంలోని కొన్ని ప్రావిన్స్‌లలో విస్తృతంగా జరుపుకొంటారు.

మూడు రోజుల పాటు నిర్వహించుకునే ఈ ఉత్సవం రంగురంగుల ఊరేగింపులతో, జానపద నృత్యాలతో కోలాహలంగా సాగుతుంది. సుమారు 20 నుంచి 25 కిలోల గన్‌పౌడర్‌తో నింపిన ఈ రాకెట్లను బౌద్ధ పురాణాల్లోని 'నాగ' అనే పౌరాణిక సర్పం బొమ్మతో అలంకరిస్తారు. రాకెట్లను ప్రయోగించే ముందు బౌద్ధ సన్యాసులు వీటికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదిస్తారు. రాకెట్లను తయారు చేసిన బృందాలకు బహుమతులు అందజేస్తారు. అయితే, ఒకవేళ ఏదైనా రాకెట్ ప్రయోగం విఫలమైతే, ఆ రాకెట్ తయారుచేసిన వాళ్లని సరదాగా బురదలో ముంచి శిక్షిస్తారు. ఇది దేవుడికి ఆగ్రహం కలిగించిందని భావించి చేసే ఒక వినోదాత్మక ఆచారం.

పురుషులు, స్త్రీల వేషధారణలో కనిపిస్తూ, హాస్యభరితమైన ప్రదర్శనలతో పర్యాటకులను అలరిస్తారు. వ్యవసాయ ఇతివృత్తాలతో



కూడిన జానపద నృత్యాలు ఇక్కడ ప్రధానం. ముఖ్యంగా 'లామ్ వాంగ్' అనే నృత్యంలో పాల్గొనేవారు వృత్తాకారంలో లయబద్ధంగా నర్తిస్తారు. వేడుక సందర్భంగా బంధుమిత్రులతో కలిసి విందులు చేసుకుంటారు.

ఈ బున్ బాంగ్ ఫై కేవలం ఆధ్యాత్మిక వేడుకగానే కాకుండా, ఒక అంతర్జాతీయ పర్యాటక ఆకర్షణగానూ మారింది. టూరిజం అథారిటీ ఆఫ్ థాయ్‌లాండ్ 1974 నుంచి ఈ వేడుకలకు అండగా నిలుస్తోంది. ఈ మూడురోజుల పండుగ కాలాన్ని ఈశాన్య ప్రాంతంలో సెలవుదినంగా గుర్తిస్తారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమవ్వడానికి ముందు రైతులు జరుపుకునే ఈ వినోదభరిత ఉత్సవం ప్రకృతికి, మానవ సంకల్పానికి మధ్య ఉన్న విడదీయలేని బంధానికి నిదర్శనంగా నిలుస్తోంది.

## ప్రభుత్వ సేవలు ఆన్‌లైన్‌లోనే అందాలి

**అమరావతి:** ఆన్‌లైన్ సేవలు సులభతరం చేసేందుకు ఏఐ అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్‌చైన్ వంటి సాంకేతికతలను వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రజలు అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పనిలేకుండా సేవలు అందించాలని నిర్దేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయం నుంచి వివిధ శాఖల పనితీరు, పురోగతిపై సమీక్షలో ఆయన మాట్లాడారు. 'వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా అందిస్తున్న 1,204 సేవలకు సంబంధించి డేటా ఎంట్రీ సమాచారాన్ని మరింత సంక్షిప్తం చేయాలి. సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేసే పని లేకుండా డేటా ఇంటిగ్రేషన్ జరగాలి' అని పేర్కొన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సమృద్ధిగా నీరందేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. 'ఇప్పటికీ సాగు మొదలుపెట్టని చోట వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి. రైతులకు ఎప్పటికప్పుడు క్రాప్ ఎలర్ట్స్ సందేశాలు పంపడంతో పాటు దానిపై తీసుకునే చర్యలను అధికారులు పర్యవేక్షించాలి. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి ' అని పేర్కొన్నారు. కృష్ణా డెల్టాకు సెప్టెంబరు ఆఖరు వరకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందించగలమని అధికారులు వివరించారు. గత ఏడాది ఇదే సమయానికి 1,361 డెంగీ కేసులు నమోదైతే.. ఈ ఏడాది 401 కేసులే నమోదయ్యాయని తెలిపారు.

## ప్రభుత్వం మారినా.. ఆగని మైనింగ్ అక్రమాలు

**విజయవాడ** : రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. మైనింగ్ అక్రమాలు ఆగలేదని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎ.బి.వెంకటేశ్వరరావు ఆరోపించారు. జగన్ హయాంలో మైనింగ్‌లో జరిగిన అక్రమాలు, దౌర్జన్యాలు ప్రజలకు తెలుసని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ మైనింగ్ వ్యవహారాలు తెదేపాకు సంబంధించిన వర్గాల ఆధీనంలోకి వెళ్లాయని పేర్కొన్నారు. సోమవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 'మైనింగ్ విధానాన్ని మార్చి పారదర్శక విధానం రూపొందిస్తామని మంత్రి లోకేశ్ గతంలో చెప్పారు. ఇప్పుడు ఆ హామీకి విరుద్ధంగా పరిస్థితులు ఉన్నాయి' అని ఆరోపించారు. 'గతంలో మైనింగ్ శాఖ నేరుగా వసూలు చేసేది. గ్రానైట్ వంటి ఖనిజాలపై క్యూబిక్ మీటరు, టన్ను, లారీ ప్రాతిపదికన ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. వైకాపా ప్రభుత్వంలో మైనింగ్ శాఖ ద్వారా వసూళ్లను పక్కన పెట్టి, అమ్మకాలు, వసూళ్లను జిల్లాల వారీగా ప్రైవేటు కంపెనీలకు అప్పగించింది' అని విమర్శించారు. 'గుంటూరుతోపాటు పలు జిల్లాల్లో మైనింగ్ కాంట్రాక్టులను ప్రైవేటు కంపెనీలకు అప్పగించారు.

# పొత్తులో మిత్రులు..

- ఎమ్మెల్సీ మంటలు.. కూటమిలో సెగలు
- టీడీపీ ఖాతాలో రెండు ఎమ్మెల్సీలు..
- ఎమ్మెల్సీ ఎంపికతో కూటమిలో కలకలం
- మిత్రుల మధ్య మౌన యుద్ధం.. ఎమ్మెల్సీలతో బహిర్గతం!

# పదవుల్లో ఒంటరిగానే!



అమరావతి : కూటమి ప్రభుత్వంలో మిత్రపక్షాల మధ్య విభేదాలు మరోసారి తెరపైకి వస్తున్నాయా? గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా టీడీపీ సీనియర్లు వర్ల రామయ్య, దళవాయి రమాదేవిని ఎంపిక చేయడం ఇప్పుడు కూటమి రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏ నిర్ణయమైనా మిత్రపక్షాలతో చర్చించి, సమష్టిగా తీసుకున్నట్టుగా కనిపించే టీడీపీ.. ఈసారి మాత్రం రెండు ఎమ్మెల్సీ పదవులనూ తన ఖాతాలో వేసుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

## మిత్రులకు సమాచారం లేకుండానే నిర్ణయం?

గవర్నర్ కోటాలో భర్తీ చేయాల్సిన రెండు ఎమ్మెల్సీ స్థానాలపై టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య చర్చ జరిగిందనే ప్రచారం కూడా లేకపోవడం గమనార్హం. ముఖ్యంగా బీజేపీకి ఒక ఎమ్మెల్సీ పదవి ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్టు విశ్వసనీయ వర్గాల్లో ప్రచారం జరిగింది. వైసీపీ నుంచి బీజేపీలో చేరిన ఓ నేతను శాసనమండలికి పంపాలన్న ఆ పార్టీ అధిష్టానం ఆలోచనలో ఉన్నట్టు కూడా సమాచారం. అయితే మిత్రపక్షాలకు కనీస సమాచారం ఇవ్వకుండానే ఇద్దరు టీడీపీ నేతలను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయడంతో బీజేపీ వర్గాలు అసంతృప్తికి గురైనట్టు తెలుస్తోంది. కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న తమకు కనీస సంప్రదింపులు లేకపోవడంపై ఆ పార్టీ నేతలు లోలోపల గుర్రుగా ఉన్నట్టు సమాచారం.

## పదవుల దగ్గర అసలు రంగు?

ఎన్నికల సమయంలో మిత్రపక్షాల అవసరం ఉన్నప్పుడు మాత్రమే పొత్తులను ప్రస్తావించడం.. పదవుల పంపకంలో మాత్రం సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వడం టీడీపీ వైఖరిగా ఉందన్న అభిప్రాయం జనసేన, బీజేపీ వర్గాల్లో వ్యక్తమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్సీ పదవుల ఎంపిక ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చిందని ఆయా పార్టీల నేతలు వ్యాఖ్యానిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు.. మిత్రపక్షాల నుంచి ఈ అంశంపై బహిరంగంగా పెద్దగా స్పందన రాకపోవడం కూడా చర్చకు దారితీస్తోంది. అసంతృప్తి ఉన్నప్పటికీ కూటమి ఐక్యత దెబ్బతినకుండా వ్యవహరిస్తున్నారా? లేక సమయం కోసం వేచి చూస్తున్నారా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

## బలం ఉంటే ఒంటరిగా పోటీ చేయండి...

జనసేనకు ప్రజల్లో బలమైన ఆదరణ ఉందని ఆ పార్టీ నేతలు భావిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ బలాన్ని నిరూపించుకోవాలని టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు సవాల్ విసురుతున్నారు. అంతేకాకుండా సార్వత్రిక ఎన్నికల్లోనూ ఒంటరిగా పోటీ చేసి పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలని వ్యాఖ్యానిస్తున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీతో పొత్తు లేకుండా పోటీ చేసిన జనసేనకు ఎదురైన ఫలితాలను కూడా టీడీపీ సోషల్ మీడియా వర్గాలు గుర్తుచేస్తున్నాయి. అప్పట్లో పవన్ కల్యాణ్ స్వయంగా రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసి ఓడిపోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ జనసేనపై విమర్శలు గుప్పిస్తున్నాయి.



## జనసేన వ్యాఖ్యలతో టీడీపీలో అసహనం

ఇదిలా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల పంపకం, భవిష్యత్ రాజకీయ సమీకరణాలు, 2029లో పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్న జనసేన నేతల వ్యాఖ్యలు టీడీపీ వర్గాల్లో అసహనాన్ని పెంచుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా జనసేన నేతలు, ప్రజాప్రతినిధులు చేస్తున్న కొన్ని వ్యాఖ్యలను టీడీపీ వర్గాలు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే ప్రయత్నంగా భావిస్తున్నట్టు సమాచారం. సోషల్ మీడియాలో అయితే ఈ అసంతృప్తి మరింత బహిర్గతమవుతోంది.

## పాత వీడియోలతో సోషల్ మీడియాలో వార్

జనసేన సంస్థాగతంగా ఇంకా బలపడాల్సి ఉందంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పాత వీడియోలను టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు మళ్లీ వైరల్ చేస్తున్నారు. టీడీపీతో పొత్తు లేకుండా పోటీ చేస్తే జనసేనకు ఎదురయ్యే పరిస్థితులపై అప్పట్లో పవన్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.. ఇప్పుడు ఆ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ప్రశ్నిస్తున్నారు. 'పొత్తులో ఉన్నాం కాబట్టి సంయమనం పాటిస్తున్నాం.. దాన్ని అసమర్థతగా భావించొద్దు' అంటూ కొందరు టీడీపీ కార్యకర్తలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. జనసేన నేతలు, ముఖ్యంగా బొలిశెట్టి శ్రీనివాస్, పంతం నానాజీ తదితరుల వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు.

## కూటమి ఐక్యతకు సోషల్ మీడియా సవాల్

ఇప్పటికే కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సోషల్ మీడియా వేదికగా పరస్పర విమర్శలు పెరుగుతున్నాయి. కూటమి నేతలు, కార్యకర్తలు ఒకరినొకరు తిట్టుకోవద్దని, విమర్శలు చేయవద్దని సమష్టిగా పిలుపునిచ్చినప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఒకవైపు పదవుల పంపకంలో అసంతృప్తి.. మరోవైపు స్థానిక ఎన్నికల సీట్లపై పోటీ.. ఇంకోవైపు 2029 ముఖ్యమంత్రి అంశంపై జనసేనలో పెరుగుతున్న చర్చ.. ఇవన్నీ కలిసి కూటమిలో అంతర్గతంగా ఉన్న అసహనాన్ని బయటకు తెస్తున్నాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికతో మొదలైన ఈ చర్చ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఎటువైపు దారితీస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## 34 శాతం బీసీ రిజర్వేషన్లపై కూటమి ప్రభుత్వం హైడ్రామా..

**అమరావతి:** బీసీలకు వెన్నుపోటు పొడుస్తున్న పార్టీనే ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పేరుతో సభలో హైడ్రామా నడుపుతోందని వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మండిపడ్డారు. గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం 34 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తూ జీవో విడుదల చేసిందని, ఆ తర్వాత ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తితో కోర్టులో రిట్ పిటిషన్ వేయించారని ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద రమేష్ యాదవ్ మాట్లాడుతూ..పార్టీ పరంగా బీసీలకు 50 శాతం సీట్లు కల్పించిన నాయకుడు శ్రీ వైయస్ జగన్ అని, 18 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయితే అందులో 11 స్థానాలను బీసీలకు ఇచ్చారని తెలిపారు. మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లు, కార్పొరేషన్లలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించడంతో పాటు ఇద్దరు బీసీలను డిప్యూటీ సీఎంలుగా చేసిన ఘనత జగన్‌దేనని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వలేదని, చంద్రబాబు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారని విమర్శించారు. 136 బీసీ కులాలను గుర్తించి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వానిదేనని రమేష్ యాదవ్ తెలిపారు. కోర్టులో నిలబడదని తెలిసే చంద్రబాబు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టారని ఆరోపించారు. బీసీలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే మంత్రి మండలిలో బీసీకి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందా అని ప్రశ్నించారు.

# మండలిలో డీఎస్సీ మంటలు

- చర్చకు వైసీపీ డిమాండ్
- ఛైర్మన్ పోడియం వద్ద ఆందోళన
- శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్‌గా తూమాటి మాధవరావు ఏకగ్రీవ ఎన్నిక
- సభా సంప్రదాయాలను పాటించని అధికార పక్షం
- కార్యక్రమానికి బాయ్‌కాట్

**అమరావతి: శాసనమండలిలో వాతావరణం వేడెక్కింది. ముఖ్యంగా డీఎస్సీ అక్రమాలపై చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ వైసీపీ సభ్యులు పోడియం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సమయంలో ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మంత్రి మనోహర్ రూల్ బుక్ చదివి వినిపిస్తూ, వైసీపీ సభ్యులు కావాలనే సభా సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం డీఎస్సీ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతిపక్షం రసాభాస చేస్తోందని ఆయన ఆరోపించారు. గందరగోళం మధ్యే మండలి ఛైర్మన్ మోషేన్ రాజు ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.**

### డిప్యూటీ ఛైర్మన్‌గా తూమాటి

ఆంధ్రప్రదేశ్ శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్‌గా తూమాటి మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైసీపీ సభ్యుడిగా ఉన్న మాధవరావుకు పోటీగా కూటమి నుంచి ఎవరూ దరఖాస్తు చేయకపోవడంతో ఆయన ఎన్నికను ఛైర్మన్ ప్రకటించారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించి సభను నిర్వహించారు. అయితే ఈ ప్రక్రియకు అధికార పక్షం పూర్తిగా దూరంగా ఉంది.

ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మాధవరావును వైసీపీ సభ్యులు సభా అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టారు. ఇందులో కూడా కూటమి సభ్యులు ఎవరూ పాల్గొనలేదు. ఆయనకు శుభాకాంక్షలు చెప్పే క్రమంలో కూటమి నేతల తీరుపై వైసీపీ సభ్యులు మండిపడ్డారు. డిప్యూటీ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా అధికార కూటమి పార్టీల సభ్యులు



దూరంగా ఉండటంపై మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా సంప్రదాయాలను పాటించడంలో అధికార పక్షం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, విభజిత ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇలాంటి కార్యక్రమాలు జరిగినప్పుడు అన్న పార్టీలు కలిసి పాల్గొనేవారని,కానీ ఇప్పుడు కూటమి సభ్యులు సభ గౌరవాన్ని పాటించలేదని విమర్శించారు. వైస్ ఛైర్మన్‌ను సీటులో కూర్చోబెట్టే సమయంలో అధికార పక్ష బాయ్‌కాట్ చేయడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగలేదని, సరైన పద్ధతి కాదని వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధ్వజమెత్తారు.



సభలోకి ఇద్దరు కొత్త సభ్యులు

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ రాష్ట్ర శాసనమండలికి సంబంధించి కీలక ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేస్తూ వర్ల రామయ్య, దళవాయి రమాదేవిని ఎమ్మెల్సీలుగా నియమించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వర్ల రామయ్య, దళవాయి రమాదేవి నియామకం మండలిలో కూటమి పక్షానికి మరింత బలాన్ని చేరూకూర్చనుంది. ఈ నియామకానికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో మండలిలో నూతన సభ్యుల రాక ఖాయమైంది.

## రిజర్వేషన్ల అంతానికి మోదీ సర్కారు కుట్ర

**ఢిల్లీ:** రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రపన్నిందని, దీనిలో భాగంగానే కేంద్రానికి చెందిన వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 8.2లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడంలేదని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మంత్రిత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులపై మీడియా నివేదికను ఉటంకిస్తూ విమర్శలు సంధించారు. '2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 4.21లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నాయి.

2024కు వాటి సంఖ్య 8.24 లక్షలకు చేరాయి. రైల్వేల్లో 2.40లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లోని 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను రద్దు చేశారు. ఇవికాక రక్షణ రంగంలో 2.41 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి' అని ఖర్గే తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు 19శాతం నుంచి 49శాతానికి పెరిగారని వెల్లడించారు. 'ఇది ఒక్క ఉపాధి సమస్య మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన సామాజిక న్యాయం అంశం కూడా ఇమిడి ఉంద'ని పేర్కొన్నారు.

విద్య, ఉపాధి రంగాల్లో యువ భారతీయుల జీవితాలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గల 8.7 కోట్ల మంది యువత చదువులు, ఉపాధికి దూరమయ్యారని, వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణలూ అందడంలేదన్నారు. నీతిఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగుల శాతం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ విమర్శించారు.

## ప్రధాని మోదీ నేతృత్వంలో ఇస్రో పరిధి మరింత విస్తృతం

**ఢిల్లీ:** ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఊపిరితీస్తున్నారని, నిర్వీర్యం చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తోన్న విమర్శలను అధికార భాజపా తిప్పికొట్టింది. ప్రధాని మోదీ నేతృత్వంలో ఇస్రో పరిధి ఎంతో విస్తృతమైందని తెలిపింది. అంతరిక్ష పరిశోధనల్లో జాతీయ ఆకాంక్షలను నెరవేర్చేలా వందల కొద్దీ స్టార్టప్‌లు ఇప్పుడు దేశంలో పనిచేస్తున్నాయని, ప్రభుత్వ యాజమాన్యం స్థాయి నుంచి ప్రైవేటు రంగానికీ విస్తరించిన ఈ పరిశ్రమ వృద్ధిచెందుతోందని భాజపా జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ పేర్కొన్నారు. 2014కు ముందు 35 విదేశీ ఉపగ్రహాలను మాత్రమే ప్రయోగించగలిగిన ఇస్రో...2026 జనవరి నాటికి 399 విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లిందని తెలిపారు. న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) ఆదాయం 2021-22లో రూ.321.77 కోట్లు కాగా 2024-25కు రూ.3వేల కోట్లకు పెరిగిందన్నారు. ఇవన్నీ గణాంకాలు చెబుతున్న వాస్తవాలని ప్రదీప్ భండారీ పేర్కొన్నారు. చంద్రుడి తోపాటు శుక్ర, అంగారక గ్రహాల మీద కూడా ప్రయోగాలకు ఇస్రో సన్నద్ధమవుతోందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శలను తోసిపుచ్చారు. ఇస్రో శాస్త్రవేత్తలు దశాబ్దాలపాటు శ్రమించి అభివృద్ధిచేసిన వ్యవస్థలు, సదుపాయాలను మోదీ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తోందంటూ సామాజిక మాధ్యమం'ఎక్స్'లో జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. కొన్ని నెలల వ్యవధిలోనే 120 మంది వరకూ కీలకమైన నిపుణులు ఇస్రోను వీడి వెళ్లారని ఆరోపించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

**సత్తెనపల్లి న్యూస్ :** మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు కోర్టు రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ చుక్క శ్రీనివాసరావు, శివరాత్రి శివ కోటేశ్వరరావు, ఎనబల్ల బాల యేసు పట్టుబడ్డారు.పోలీసులు నిందితులను స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గోకనకొండ చిన్న ఎదుట హాజరుపరచగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి టౌన్ పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రమాదాలు అరికట్టాలని మద్యం సేవించి వాహనాలు నడప రాదని హెల్మెట్ ప్రతి ఒక్కరూ ధరించాలని ప్రమాదాన్ని అరికట్టాలని పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావుతెలిపారు.

## సత్తెనపల్లిలో పోలీసుల విస్తృత తనిఖీలు



**సత్తెనపల్లి న్యూస్ :** పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే ధ్యేయంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాల మేరకు, సత్తెనపల్లి డీఎస్పీ ఎం.వి.కే. కృష్ణచైతన్య పర్యవేక్షణలో శనివారం ఉదయం స్థానిక రంగా కాలనీలో పోలీసులు భారీ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసు అధికారులను, సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా విభజించి కాలనీలోని ప్రతి ఇల్లు, పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత కేసుల్లో నిందితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పరిశీలనలో భాగంగా సరైన పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అనంతరం వెల్దుర్తి మండలం పిస్ కండ్లకుంట గ్రామంలో నిర్వహించిన ఫుట్ పెట్రోలింగ్ సందర్భంగా ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... అవగాహన: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పిలుపు:గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. భద్రతా చర్యలు:గ్రామంలో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 112 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. పాత నేరస్థులకు హెచ్చరిక:పాత కేసుల నిందితులు సత్ప్రవర్తనతో మెలగాలని, మళ్లీ పాత పంథా కొనసాగిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. స్థానిక ప్రాంతాల్లో అశాంతి సృష్టించినా, అకారణంగా గొడవలకు దిగినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని, ఏ చిన్న సమస్య ఉన్నా నేరుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షుడిగా వల్లెం చెన్నకే



**సత్తెనపల్లి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో నిర్వహించిన ప్రజానాట్యమండలి ద్వితీయ మహాసభలలో ఈ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ మహాసభలలో సత్తెనపల్లికి చెందిన పొత్తూరి రామకోటయ్య, ఎలిశెట్టి ప్రసాదు, కే.ప్రేమ్ కుమార్ లు పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా చెన్నకేశవరావు, కార్యవర్గ సభ్యులుగా రామకోటయ్య, ప్రసాదు, ప్రేమ్ కుమార్ లు ఎన్నిక కావడం పట్ల పలువురు నాయకులు, కళాకారులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు.

ఏఐటీయూసీ నాయకులు: ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కంబాల శ్రీనివాస్, సత్తెనపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఈసీ రెడ్డి అంజిరెడ్డి. సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మునునూరి రమేష్, మాజీ కార్యదర్శి నరిశెటి వేణుగోపాల్. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు ఎస్.ఎం. సుభాని, జిల్లా నాయకులు విజయ్ ప్రసాద్, కే. సురేష్, టీ. రాజు, మండల అధ్యక్ష కార్యదర్శులు పి. వెంకయ్య, ఎస్. సుభాని., బి. యలమంద, భాస్కర్, మస్తాను, యేసయ్య. ఇతర సంఘాల ప్రతినిధులు: ఆటో యూనియన్ సత్తెనపల్లి శాఖ అధ్యక్షులు డియర్ మస్తాన్, సత్తెనపల్లి ప్రాంత రంగస్థల కళాకారులు, ప్రజానాట్యమండలి కళాకారులు మరియు స్థానిక ప్రజాసంఘాల నాయకులు, సీపీఐ శ్రేణులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## రేవతి కుటుంబాన్ని పరామర్శించిన వైసీపీ నాయకులు



**సత్తెనపల్లి న్యూస్ :** సత్తెనపల్లి పట్టణంలోని 20వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ కన్వీనర్ భవిశెట్టి మణిదీపిక కుమార్తె రేవతి ప్రమాదవశాత్తు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయి అకాల మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన స్థానిక ప్రజలను, పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. విషయం తెలుసుకున్న వెంటనే సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. రేవతి భౌతికకాయానికి అంజలి ఘటించి, మణిదీపిక కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్ట సమయంలో వారికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇస్తూ, తీవ్ర సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామీణ, వార్డు స్థాయి పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాధిత కుటుంబానికి తమ సానుభూతి తెలిపారు.



# సత్తెనపల్లిలో విజవంతంగా ఇంటింటి ప్రచారం



**సత్తెనపల్లి న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఇచ్చిన హామీలలో 90 శాతం పూర్తి చేసి చూపామని, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 22వ వార్డు పరిధిలో నిర్వహించిన "2 ఏళ్ల నమ్మకం - సంక్షేమం - అభివృద్ధి" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రతి ఇంటా తిరిగి, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరి వద్దకూ గర్వంగా తీసుకెళు న్నామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రతి ఇల్లూ తిరుగుతూ ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి బలంగా



తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ మరియు వార్డు స్థాయి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.







## చంద్రాజుపాలెంలో 'ఇంటింటికీ కూటమి ప్రభుత్వం' కార్యక్రమం

**పెదకూరపాడు:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆదేశాల అనుసారం కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో 'డోర్ టు డోర్' ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెదకూరపాడు నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు గుంజి గంగారావు, తన సొంత గ్రామమైన చంద్రాజుపాలెంలో ఇంటింటికీ తిరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రజలకు వివరంగా తెలియజేశారు. రాబోయే రోజుల్లో పార్టీని, కూటమి ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన గ్రామస్థులను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓర్చు రాంబాబు, నందిరాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు ఓర్చు ఆనంద్, ఏసు పాదం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ నరసింహ, నాయకులు బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, నితీష్ కుమార్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అచ్చంపేటలో 'వార్త' దినపత్రిక కార్యాలయం ప్రారంభం

**ప్రజా సమస్యలకు వేదికగా నిలవాలి: మండల రెవెన్యూ అధికారి ఎన్. సరోజ**

**అచ్చంపేట, సత్తెనపల్లి న్యూస్:** అచ్చంపేట మండల కేంద్రంలో 'వార్త' దినపత్రిక నూతన కార్యాలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. 'వార్త' అచ్చంపేట మండల విలేకరి కమల్ భాష ఆధ్వర్యంలో, మండల రెవెన్యూ అధికారి ఎన్. సరోజ సమక్షంలో కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 'వార్త' బ్యూరో ఇన్‌చార్జి ఎం. అల్లూరి రెడ్డి కూడా హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకు రావడంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రజలకు, అధికార యంత్రాంగానికి మధ్య వారధిగా పనిచేస్తూ అచ్చంపేట మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక అంశాలను సమగ్రంగా ప్రజలకు చేరవేయాలని ఆకాంక్షించారు. ప్రజల





సమస్యలకు 'వార్త' కార్యాలయం వేదికగా నిలవాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి అచ్చంపేట మండల కాపు సంఘం అధ్యక్షుడు గంధం కోటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకుడు గొల్లమూడి చందు, పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొమరాల రమేష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్.కె. సైదా కమాల్, వినియోగదారుల ఫోరం జిల్లా కార్యదర్శి చిన్న బాచ్చా సాహెబ్, మైనారిటీ నాయకురాలు ఎస్.కె. ప్యారీ తదితరులు హాజరై కార్యాలయ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా అచ్చంపేటకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల మండల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన కార్యాలయం ద్వారా అచ్చంపేట మండలంలోని గ్రామీణ ప్రాంతాల వార్తలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.






# లిఫ్ట్‌లో ఇరుక్కుని 12 ఏళ్ల చిన్నారి రేవతి మృతి

**సత్తెనపల్లి న్యూస్ :** సత్తెనపల్లి కొత్తపేటలో 12 ఏళ్ల చిన్నారి రేవతి 'రెడీమేడ్' లిఫ్ట్‌లో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయిన ఘటన ప్రతి ఒక్కరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సొంత ఇల్లు, అపార్ట్‌మెంట్లలో తక్కువ ధరకే వస్తున్నాయని నాణ్యత లేని, భద్రతా ప్రమాణాలు పాటించని లిఫ్ట్ యంత్రాలను అమర్చుకోవడం ఎంత ప్రమాదకరమో ఈ దుర్ఘటన కళ్లకట్టినట్లు చూపుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో అత్యంత తక్కువ ధరకు లభించే స్థానిక లేదా నాసిరకం 'రెడీమేడ్' లిఫ్ట్ తయారీ సంస్థలు పుట్టుకొచ్చాయి. సరైన ఇంజనీరింగ్ డిజైన్ లేకుండా, చౌకైన విడిభాగాలతో వీటిని తయారు చేస్తున్నారు.

తలుపుల మధ్య విపరీతమైన ఖాళీలు: సరైన గ్యాప్ లేకపోవడం వల్ల పిల్లలు లేదా వారి దుస్తులు ఇరుక్కుపోయే ముప్పు ఉంది. పనిచేయని సెన్సార్లు: మనుషులు లేదా వస్తువులు అడ్డువచ్చినప్పుడు ఆటోమేటిక్‌గా ఆగే డోర్ సెన్సార్లు, సేఫ్టీ ఇంటర్‌లాక్స్ వీటిలో ఉండటం లేదు. ఎమర్జెన్సీ సేఫ్టీ లోపం: విద్యుత్ నిలిచిపోయినప్పుడు లేదా సాంకేతిక లోపం వచ్చినప్పుడు బయటకు వచ్చే 'ఆటోమేటిక్ రెస్క్యూ డివైస్' అలారమ్‌లు అమర్చకపోవడం.

**నిబంధనల ఉల్లంఘన అధికారుల పర్యవేక్షణ లోపం**

ఆంధ్రప్రదేశ్ భవన నిబంధనల ప్రకారం భవన ప్రణాళికతో పాటు లిఫ్ట్ షాఫ్ట్ డిజైన్, దాని లోడ్ సామర్థ్యం మరియు సేఫ్టీ సర్టిఫికేషన్ కీలకమైనవి. కానీ, అనుమతులు పొందాక నిర్మాణాలు





చేసే క్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారుల తనిఖీలు లోపించడం, బిల్డర్లు తక్కువ ఖర్చు కోసం నాసిరకం లిఫ్టులు ఏర్పాటు చేస్తుండటంతో ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు.

సర్టిఫైడ్ తయారీదారులే మేలు:కేవలం తక్కువ ధరకే వస్తుందని కాకుండా, ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రమాణాలు ఉన్న కంపెనీల లిఫ్టులనే ఎంచుకోవాలి. నిపుణులైన సర్వీసింగ్ ఏజెన్సీలతో ప్రతి నెలా తనిఖీలు నిర్వహించాలి. చిన్న శబ్దం వచ్చినా వెంటనే వినియోగం ఆపేయాలి. అధికారులు కేవలం కాగితాలపై అనుమతులు ఇవ్వడమే కాకుండా, ప్రత్యక్షంగా ప్రతీ భవనంలో ఉన్న లిఫ్టుల భద్రతపై ముమ్మర తనిఖీలు చేపట్టాలి.

ఈ ఘటనపై సత్తెనపల్లి డీఎస్పీ కృష్ణ చైతన్య విచారణ వేగవంతం చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందే నాసిరకం లిఫ్ట్ తయారీదారులపై మరియు భద్రతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే ఇటువంటి విషాదాలకు చెక్ పెడుతుంది.

సీసీ కెమెరాలు ముఖ్యంగా వాడాలి ప్రమాదం సమయంలో సీసీ కెమెరాలు లేకపోవడం విషాదకరం చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఘటన ఎలా జరిగిందో ఘటనకి సంబంధించిన వీడియో లేకపోవటమే జరిగింది. పోలీసులు ఈ కేసు పై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు

## పోలీస్ స్టేషన్ ఎదుట వైఎస్సార్‌సీపీ ఆందోళన



**వినుకొండ/ఐనవోలు:** పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గుంటుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ ప్రధాన కార్యదర్శి భీమిని అంకారావు అరెస్ట్‌ను నిరసిస్తూ వినుకొండ నియోజకవర్గంలోని ఐనవోలు పోలీస్ స్టేషన్ ఎదుట వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పోలీసులు అంకారావును అక్రమంగా నిర్బంధించారని ఆరోపిస్తూ నిరసనకారులు స్టేషన్ ముట్టడికి యత్నించారు. ప్రభుత్వం, పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయనను తక్షణమే, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అకారణంగా అరెస్ట్ చేయడం రాజకీయ కక్షసాధింపు చర్యేనని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అంకారావును విడుదల చేసే వరకు తమ ఆందోళన విరమించేది లేదని నిరసనకారులు స్పష్టం చేయడంతో ఐనవోలు పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



# కళ తప్పిన అయోధ్య.. విరాళాల చోరీ తర్వాత తగ్గిన భక్తులు

**అయోధ్య :** అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ ఉదంతం స్థానిక వ్యాపారులు, హోటళ్లపై పెను ప్రభావాన్ని చూపిస్తున్నది. చోరీ ఘటనకు ముందు రోజులతో పోలిస్తే భక్తుల సంఖ్య 25 శాతం తగ్గిపోయిందని రామ్‌పథ్‌లో గంధం, పూల దండలు అమ్మే వ్యాపారి తెలిపారు. గతంలో రోజుకు రూ.4-5 వేలు సంపాదించే ప్రసాదాల వ్యాపారి ఇప్పుడు వెయ్యి రూపాయలు సంపాదించడానికి కష్టాలు పడుతు న్నాడు. తాను వాహన నిర్వహణ ఖర్చులను కూడా భరించ లేక పోతున్నానని అజయ్ అనే ఈ-రిక్షా డ్రైవర్ తెలిపారు. అల్పాహార సమయంలో ఒక ప్రజాదరణ పొందిన హోటల్‌లో బల్లలన్నీ ఖాళీగా కనిపించాయి. గత 10 రోజులుగా వ్యాపారం తక్కువగా ఉందని అలాంటి హోటల్ మేనేజర్ ఒకరు తెలిపారు. మరోవైపు మధ్య స్థాయి హోటళ్లలో రూముల బుకింగ్ 25 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం 100 కొత్త హోటళ్లు అయోధ్య చుట్టుపక్కల నిర్మాణంలో ఉన్నాయి. మతపరమైన పర్యాటకం త్వరగా కోలుకోకపోతే పెట్టు బడులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. చాలా మంది హోటల్ యజమానులు, చిరు వ్యాపారులు విరాళాల చోరీ ఘటన వల్లే తమ వ్యాపారాలు బాగా తగ్గిపోయాయని నమ్ముతున్నారు.

**చోరీపై సాధువుల్లో భిన్నాభిప్రాయాలు**

విరాళాల చోరీపై స్థానిక సాధువులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. శ్రీ హనుమత్ నివాస్‌కు చెందిన మిథిలేశనందిని శరణ్ ఈ విషయాన్ని వ్యవస్థ వైఫల్యంగా కాకుండా, పరిపాలనా వైఫల్యంగా పేర్కొన్నారు. మహంత్ కమల్ నయన్ దాస్ మాట్లాడుతూ కేవలం కొందరు కింది స్థాయి ఉద్యోగుల తప్పిదంగా దీన్ని అభివర్ణించారు. శంకరాచార్యులు, మఠాధిపతులకు ట్రస్ట్‌లో చోటు కల్పించాలని మహంత్ వివేక్ అచారి కోరారు. కొత్త ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని ఒకరు డిమాండ్ చేశారు.

**హోటల్స్ బిజినెస్‌పై తీవ్ర ప్రభావం**

**యూపీ ఎన్నికల వేళ బీజేపీకి ఇబ్బందికర పరిస్థితి**




**యూపీ ఎన్నికలపై ప్రభావం!**

తొమ్మిది నెలల తర్వాత ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ తరుణంలో విరాళాల చోరీ వివాదం విపక్షాలకు ప్రధాన రాజకీయ అంశంగా మారింది. దీంతో రామాలయాన్ని తమ సైద్ధాంతిక చిహ్నంగా కలిగిన బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ నష్ట నివారణ ప్రచారాన్ని చేపట్టాయి. ఈ ఉదంతంపై సిట్ దర్యాప్తు కొనసాగుతున్నదని.. బాధ్యులపై కఠిన చర్యలుంటాయని.. ట్రస్ట్‌లో కీలక సంస్కరణలు ప్రవేశపెడుతారని ప్రజలకు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమస్య సద్దుమణగక ముందే ఎన్నికలు నిర్వహిస్తే రాజకీయ నష్టం వాటిల్లుతుందనే భయంతో ఎన్నికలను ముందుకు జరుపడానికి బీజేపీ సుముఖంగా లేదని సమాచారం.

# సకల శుభాలు, సౌభాగ్యాలు.. వరాలిచ్చే వరలక్ష్మీవ్రతం

**శావణమాసం వచ్చిందంటే చాలు ప్రతి ఇళ్లూ కలకలలాడు తుంటాయి. ముఖ్యంగా శ్రావణమాసంలో మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని తిథి నక్షత్రాలతో సంబంధం లేకుండా వరలక్ష్మీ వ్రతంగా జరుపుకొంటారు. అత్యంత శక్తిమంతమైన వ్రతాల్లో వరలక్ష్మీ వ్రతం ఒకటని అంటారు. సకల శుభాలు, అఖండ సౌభాగ్యాలు ప్రసాదించే వరలక్ష్మీ వ్రతానికి విశేష ప్రాధాన్యత ఉంది. అన్ని మాసాల్లో కన్నా శ్రావణమాసం శివకేశవులతో పాటు లక్ష్మీదేవికి ప్రీతికరమైనది. క్షీరసాగర మథనం జరిగినప్పుడు మొదటగా లక్ష్మీదేవి అవతరించిందని పురాణాలు పేర్కొంటున్నాయి.**

విష్ణుమూర్తిని నారాయణ స్వరూపుడిగా లక్ష్మీదేవిని వరలక్ష్మీగా భావించి వ్రతం ఆచరిస్తే మహిళలకు సకల సౌభాగ్యాలు కలుగుతాయని చెబుతారు. స్కంద పురాణంలో సైతం శివుడు పార్వతీదేవికి వరలక్ష్మీ వ్రతం ప్రాముఖ్యతను గురించి వివరించారు. వ్రతం ఆచరించి తోటి సుహాసినులకు పసుపు, కుంకుమలు అందజేసి ఆశీస్సులు తీసుకుంటారు. చారుమతి కథను చదువుకొని ధూప దీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. పెండ్లి అయిన ప్రతి మహిళా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించాలని పెద్దలు చెబుతారు.

**చారుమతి కథ..** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా చారుమతి కథను భక్తిగా చెప్పుకొంటారు. వరలక్ష్మీ కటాక్షాన్ని పొందిన మహిళ పేరు అది. చారుమతి అంటే.. మంచి బుద్ధి కలిగినది, మితభాషి అని అర్థం. వ్రతాలను ఆచరించడానికి అందరూ అర్హులేననీ, సామూహికంగా ప్రార్థిస్తే.. ఎక్కువ ఫలితం ఉంటుందనే సామాజిక



స్పృహ కలిగిన మహిళ చారుమతి. కుటుంబ ధర్మాన్ని, గృహిణి బాధ్యతలను ఆమె నిర్వర్తించిన తీరు ఆదర్శవంతం.

లక్ష్మీ కటాక్షంలో స్త్రీ పాత్రే కీలకమని పురాణాలు చెబుతున్నాయి. అత్తమామలను ఆదరించే కోడలున్న ఇంట శ్రీలక్ష్మి కొలువై ఉంటుంది. భర్తను గౌరవిస్తూ అతనికి మంచిని సూచించే భార్య నిజమైన గృహలక్ష్మి. భార్యాభర్తలు కీచులాడుకోని ఇంట్లో వరలక్ష్మి స్థిరంగా ఉంటుందని భాగవతం పేర్కొన్నది. చారుమతి కథను అర్థం చేసుకొని జీవితానికి అన్వయించుకుంటే ఇంటిదీపం ఇల్లాలే అవుతుంది. ఆమెలోని సద్గుణాలు అలవరచుకొంటే వ్రతఫలం పూర్తిగా దక్కుతుంది. చెడుబుద్ధి, దుష్ట సంకల్పం, దుర్గుణాలు లేని స్వచ్ఛమైన మనసు కలిగినవారే లక్ష్మీదేవి అనుగ్రహానికి పాత్రులవుతారని ఈ కథ ద్వారా తెలుస్తుంది. ఇంటికి ఇల్లాలే.. వరలక్ష్మి. ఆమెను గౌరవించడం, అర్థం చేసుకోవడం, ఆమె శ్రమలో భాగం పంచుకోవడం భర్త బాధ్యత కూడా.

# రైళ్లలో 1.27 కోట్ల టవల్‌లు, దుప్పట్లు చోరీ..



భారతీయ రైల్వేలోని రైళ్ల ఏసీ కోచ్‌లలో ప్రయాణికులకు అందించే బెడ్‌రోల్ సామగ్రి భారీ స్థాయిలో చోరీకి గురవుతోంది. కొవిడ్ అనంతరం 2022 జనవరి నుంచి 2026 మే వరకు నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా టవళ్లు, దిండ్లు, దుప్పట్లు వంటి కనీసం 1.27 కోట్ల వస్తువులు మాయమైనట్లు ఆర్‌టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దాఖలు చేసిన సమాచార హక్కు దరఖాస్తుకు 69 రైల్వే డివిజన్లలో 54 డివిజన్లు స్పందించగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. ప్రజా ఆస్తులపట్ల నిర్లక్ష్య ధోరణిని ఇది ప్రతిబింబిస్తోందని విమర్శలు వస్తున్నాయి.

ఆర్‌టీఐ వివరాల ప్రకారం.. గడిచిన నాలుగేళ్లలో టవల్‌లు, దిండ్లు, దుప్పట్ల వంటి వస్తువుల చోరీ కారణంగా బెడ్‌రోల్ కాంట్రాక్టర్లకు సుమారు రూ.104.51 కోట్ల నష్టం వాటిల్లింది. 2022తో పోలిస్తే 2025 నాటికి ఇలాంటి దొంగతనాలు 56 శాతం పెరిగినట్లు వెల్లడైంది. ఈ సమస్యను రైల్వే అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారని, దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రయాణికులు అత్యధికంగా చోరీ చేసిన వస్తువుల్లో ఫేస్ టవల్ మొదటి స్థానంలో నిలిచింది. నాలుగేళ్లలో 46.54 లక్షల ఫేస్ టవల్స్ మాయమయ్యాయి.

వాటి తర్వాత 41.13 లక్షల బెడ్‌షీట్లు, 23.59 లక్షల పిల్లో కవర్లు, 12.95 లక్షల దుప్పట్లు చోరీకి గురయ్యాయి. మరోవైపు బ్యాగులో సులభంగా పెట్టుకోలేని కారణంగా దిండ్లు అత్యల్పంగా చోరీకి గురయ్యాయి. రైల్వే డివిజన్ల వారీగా చూస్తే బికనెర్ డివిజన్‌లో అత్యధికంగా 25.76 లక్షల వస్తువులు చోరీకి గురయ్యాయి. తర్వాత రాంచీ (9.31 లక్షలు), ఢిల్లీ (8.21 లక్షలు), ముంబై (8.17 లక్షలు), జోధ్‌పూర్ (8.09 లక్షలు), అహ్మదాబాద్ (6.94 లక్షలు) డివిజన్‌లు ఉన్నాయి. పంపిణీ బాధ్యత నిర్వహించే ఏజెన్సీలే ఈ వస్తువుల లెక్కలు చూసుకోవాల్సి ఉంటుందని, కొరత ఏర్పడితే ఆర్థిక భారం కూడా వారిపైనే పడుతుందని రైల్వే ప్రతినిధి తెలిపారు.

# పర్వాల పూర్ణిమ..రాఖీ పౌర్ణమి పరమార్థం ఇదే!

**దైవీశక్తులతో కూడిన శ్రావణ శుద్ధ పూర్ణిమను రాఖీపూర్ణిమగా, జంధ్యాల పూర్ణిమగా జరుపుకుంటారు. శక్తిస్వరూపిణిగా వ్యవహరించబడే ఇంటి ఆడపడచు(సోదరి) చేత ఈరోజు రక్షాబంధనం కట్టించుకున్న సోదరులకు దేవతలు రక్షగా నిలిచి అరిష్టాలను తొలగిస్తారని, అన్నింటా అండదండగా నిలుస్తారని విశ్వాసం. రక్షాబంధన పండుగ పరమార్థం ఏమిటి?**



తన సోదరుని జీవితం తీపివలె ఎల్లప్పుడూ కమ్మగా ఉండాలని, తలపెట్టే ప్రతికార్యం విజయవంతం కావాలని, అతనికి సకల సంపదలు చేకూరాలని కోరుతూ తోబుట్టువులు సోదరుని చేతికి రక్షాబంధనం కట్టే ఈ పండుగ నుంచి గ్రహించవలసిన పరమార్థం ఏమంటే%-%ప్రతిఫలాన్ని ఆశించకుండా నిష్కల్మషమైన ప్రేమతో, స్వచ్ఛమైన మనస్సుతో జరుపుకునే ఈ పండుగ సమాజంలో అందరూ ఒకరికొకరు తోబుట్టువుల వంటి వారేనని, స్వంత సంబంధం లేకపోయినా, సామాజికంగా స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, ఆత్మీయత, మమతానురాగాలు పరిఢవిల్లాలని, తోబుట్టువులు లేరని చింతించకండా సోదర ప్రేమ కలిగిన వారికి రక్షణగా నిలవాలన్నది ఈ పండుగ పరమార్థం.

ఈరోజున బ్రాహ్మణులు, వైశ్యులు, క్షత్రియులు తదితర జంధ్యాన్ని ధరించే అన్ని కులాలవారు స్నానాన్ని ఆచరించి నూతన యజ్ఞోపవీతం ధరిస్తారు. కొత్తగా ఉపనయనం జరిగిన వారికి ఉపాకర్మ జరిపిస్తారు. అందుకే దీనికి జంధ్యాల పూర్ణిమ అని పేరొచ్చింది. ఈ రోజునే హయగ్రీవ జయంతి

**"జ్ఞానానంద మయం దేవం నిర్మల స్ఫటికాకృతిం**
**ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే"**

అంటూ సర్వవిద్యలకూ ఆధారభూతంగా చెప్పుకునే హయగ్రీవుని స్తుతించడం వల్ల విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరుగుతుందని శాస్త్ర వచనం




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, తమిళ స్టార్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం రాకాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించగా, ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజా సమాచారం ప్రకారం, రాకా లో అల్లు అర్జున్ ఏకంగా నాలుగు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. మొదట విడుదలైన పోస్టర్‌లో బన్నీ బీస్ట్ తరహా పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. అయితే సినిమాలో ఆయన ఒకే పాత్రకే పరిమితం కాకుండా తాత, తండ్రి, ఇద్దరు కుమారులుగా మొత్తం నాలుగు విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

అట్లీ సినిమాల్లో మల్టిపుల్ రోల్స్‌కు ఎప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. గతంలో 'అదిరింది' చిత్రంలో విజయ్‌ను మూడు

## దర్శకుడినే ఇంప్రెస్ చేసిన బన్నీ?

విభిన్న పాత్రల్లో చూపించిన ఆయన, విజిల్ లో ద్విపాత్రాభినయం చేయించారు. అలాగే బాలీవుడ్‌లో తెరకెక్కించిన 'జవాన్' చిత్రంలో షారుఖ్ ఖాన్‌ను తండ్రీ-కొడుకులుగా రెండు పాత్రల్లో చూపించి భారీ విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు అదే తరహాలో 'రాకా'లో కూడా కథకు అనుగుణంగా మల్టిపుల్ రోల్స్‌ను ప్లాన్ చేసినట్లు సమాచారం. మొదట తాత, తండ్రి పాత్రలకు వేరే నటులను తీసుకోవాలని చిత్రబృందం భావించిందని, అయితే అల్లు అర్జున్ స్వయంగా నాలుగు పాత్రలని తానే చేయాలని సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై అట్లీ తొలుత సందిగ్ధంలో పడినా, లుక్ టెస్ట్‌లో బన్నీ చూపించిన బాడీ లాంగ్వేజ్, గెటప్ వేరియేషన్స్ చూసిన తర్వాత నాలుగు పాత్రలూ ఆయనే చేయడం సినిమాకు మరింత బలం చేకూరుస్తుందని నిర్ణయించుకున్నారని టాక్ వినిపిస్తోంది.

ఇది నిజమైతే అల్లు అర్జున్ కెరీర్‌లోనే తొలి మల్టిపుల్ రోల్ సినిమా అవుతుంది. ఇప్పటివరకు ఆయన ద్విపాత్రాభినయం కూడా చేయలేదు. దీంతో 'రాకా'లో నాలుగు పాత్రలు చేయనున్నారనే వార్త అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో నలుగురు హీరోయిన్లు నటిస్తున్నారనే ప్రచారం చాలా రోజులుగా కొనసాగుతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ఈ ప్రాజెక్ట్‌లో భాగమని అధికారికంగా ప్రకటించారు. అలాగే రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు, 'మిన్నల్ మురళి' ఫేమ్ మలయాళ నటి ఫెమినా జార్జ్ కూడా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.

## తెగించి తీసుకున్న నిర్ణయమిది



అస్తిత్వం, ఆత్మాభిమానం విషయాల్లో సమంత అస్సలు రాజీపడరు. 'విజయాన్ని సాధించాల్సింది వ్యక్తి మాత్రమే. ఆ వ్యక్తి ఆడా, మగా అనేది వ్యవస్థలో అనవసరం. అసలు ఆ ఆలోచనే అర్థరహితం' అంటారు సమంత. ఆమె తాజా చిత్రం 'మాఇంటి బంగారం' రూ.100 కోట్ల వసూళ్లు దాటింది. టాలీవుడ్‌లో ఈ క్రెడిట్ సాధించిన తొలి మహిళాప్రధాన చిత్రమిదేనని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా ఈ సినిమా విడుదలకు ముందు జరిగిన ఓ సంఘటనను సామ్ తన ఇన్‌స్టా ద్వారా పంచుకున్నారు. "'మాఇంటి బంగారం' విడుదలకు ముందు అసలు ఈ సినిమా గురించి ఎవరైనా మాట్లాడుకుంటారా? మా ప్రయత్నం ప్రేక్షకులకు చేరుతుందా? అని ఆలోచించాం. ఇందులో భాగంగా ఓ ఎగ్జిబిటర్‌కి నా స్నేహితుడు ఫోన్ చేసి ' 'మాఇంటి బంగారం' గురించి జనాల్లో ఆసక్తి ఉందా? అసలు డబ్బులు వస్తాయంటారా?' అనడిగాడు. 'ఆ.. హీరోయిన్ సినిమాలను ఎవరు చూస్తారండీ.. ఎవరైనా పెద్ద హీరో పక్కన నటిస్తే ఓకే. ఎందుకంటే ఆమె అందంగా ఉంటుంది.. అందరికీ తెలుసు. కానీ ఆమే అంతా అంటే ఎవరొస్తారు చెప్పండి!?' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడు ఆ ఎగ్జిబిటర్. ఆ మాటలు నేను వింటున్నట్టు అతనికి తెలీదు. నిజానికి ఈ అభిప్రాయం అతనిది మాత్రమే కాదు. చాలామందిలో ఇదే అభిప్రాయం ఉంది. మార్పు రావాలంటే తెగించి, ధైర్యంగా నిర్ణయం తీసుకోవాలి. నేను తీసుకున్నాను.. సఫలీకృతమయ్యాను.



## ముఖ్యమంత్రి లక్ష్మీప్రణతిగా..

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ యామినీ ఈఆర్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్న చిత్రం 'క్వీన్'. సామాజికాంశాలతో ముడిపడ్డ ఈ లేడీ ఓరియెంటెడ్ డ్రామాకి రతన్ రిషి దర్శకుడు. వన్ సర్కిల్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో ముఖ్యమంత్రి లక్ష్మీప్రణతిగా సీనియర్ నటి రమ్యకృష్ణ కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా షూట్‌లో ఆమె జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. నిజజీవిత పాత్రల స్ఫూర్తితో, వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్న ఫిక్షనల్ స్టోరీ ఇదని, సమాజంతో ముడిపడ్డ ఓ ఆసక్తికరమైన ప్రేమకథను ఇందులో చూస్తారని మేకర్స్ తెలిపారు. రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో సాయికుమార్, తనికెళ్ల భరణి, అజయ్‌ఘోష్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: బాల ఎన్. సరస్వతి, సంగీతం: భరత్ ఎం.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH. PUBLISHED AT MAHANATI SAVITHRI ROAD, BESIDES SARADHA, GRANDHALAYAM, SATTENAPALLI-522403, GUNTUR DISTRICT. ANDHRAPRADESH. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.